ప్రజాశక్తి

Vol. 5, no. 2

(Jul. 12, 1944)

బెజవాడ, 1944

Prajāśakti

Vol. 5, no. 2

(Jul. 12, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

Regd. No. M. 4486 0-2-0

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 5 సంచిక 2 | : సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ ★ పుచ్చలపల్లి సుందరయ్య తమ్మెల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు | బుధవారం 12-7-44



సోవియట్ - అమెరికన్ - బ్రిటిష్‌సేనల త్రికూటవ్యూహంలో నాజీ దుష్టమృగం చిత్తుచిత్తవుతూంది

దొంగవ్యాపారులు కరువుపరిస్థితులను తీవ్రంచేస్తున్నారు

ఆంధ్రలో నానాటికీ తీవ్రమవుతూన్న ఆహారసమస్యను చూచి ప్రజల ఆందోళన హెచ్చుపెరిగింది. కంట్రోలు, రేషనింగుల కోసం అధికారులపై ఒత్తిడి హెచ్చింది. దీని ఫలితంగా అనేక ప్రాంతాల్లో ధరలకంట్రోలు, రేషనింగు, అమల్లోకి వచ్చాయి. కాని, అంతటితో సమస్య తీరిపోలేదు: ఈరెంటినీ భగ్నంచేయడానికి షావుకార్ల కుట్రలు మితిమీరిపోయాయి. చాటుమాటున దొంగ మార్కెట్లను దాటించి, ప్రజలను, కరువు [illegible] ప్రజాసంస్థలు పరిస్థితులను వేయికళ్ళతో కనిపెట్టి, ఎప్పటికప్పుడు షావుకార్ల ఆటలను అరికట్టవలసిన అవసరం ఏర్పడింది. ఉదాహరణకు -

గంపలగూడెంలో

గంపలగూడెం (తిరువూరు తాలూకా, కృష్ణా) లో ప్రధాన ఆహారం బియ్యం, జొన్నలు. వర్తకులు కంట్రోలు ధరలను లక్ష్యం చేయకుండా బియ్యం రూపాయికి 3¾ శేర్లు అమ్మడం సాగించారు. జొన్నలు 5¼ శేర్లు. కంట్రోలు రేటుకే బిల్లురాసి, అంతకన్నా బస్తాకు నాలుగయిదు రూపాయిలు అదనంగా గుంజడం కూడా జరిగింది. కంట్రోలురేటుకు ఇవ్వమంటే సరుకులేదు పొమ్మనడం మామూలయింది. ఈ పరిస్థితులను కనిపెట్టి, స్థానిక కమ్యూనిస్టులు గతమాసం 21 వ తేదీని తహసీల్దారు వద్దకు పెద్ద డెప్యుటేషన్ తీసుకువెళ్లారు. ఈఆందోళనఫలితంగా బియ్యం ఇప్పుడు, కంట్రోలు రేటుప్రకారం రూపాయికి 4 శేర్లు దొరుకుతున్నాయి. కాశా నరసింహం అనే వర్తకుడు బియ్యమే అమ్మనని మొదటప్రతిజ్ఞచేశాడు. ఇప్పుడు కంట్రోలు రేటుప్రకారం అమ్మకతప్పిందిగాదు. హెచ్చు ధరల కమ్ముతూండిన కట్టమూరి వెంకయ్య అనే షావుకారు ఇకమీదట కంట్రోలు ధరకమ్ముతానని చెప్పి, క్షమార్పణ కోరుకున్నాడు. ఫ్యాక్టరీలు మూసేస్తామనీ, కొట్లు కట్టేస్తామనీ బెదిరించిన వారందరికి అటకట్టయింది. అధికారులు, ప్రజలు కలిసి ఈవిషయాన్నిలా చక్కబరచ గలిగారు.

కాని, పంచదార విషయంలో ఇలా జరగలేదు. ఈ గ్రామంలో పంచదారడిపో ఒకటుంది. దీనిలో వర్తకులు కంట్రోలురేటుకు మించిఅమ్ముతున్నారు. ఈ విషయాన్నిగూర్చి కూడా 21 వ తేదీని తహసిల్దారుకి తెలియజేశారు. పంచదార అమ్మకం సక్రమంగా సాగించాలని ఆయనదగ్గరున్న మునసబుతో చెప్పారు. కాని మునసబుకు అలాంటి ఉద్దేశం లేనట్లుంది. గతమాసం 27 వ తేదీని కోట బసవయ్య అనే ఆయన గంపలగూడెం నుంచి 1 మణుగు పంచదారను తీసుకుపోతుంటే, ప్రజారక్షణదళసభ్యులు పట్టుకొని మునసబు వద్దకు తీసుకువెళ్లారు. ఆయన ప్రజారక్షణదళ సభ్యులపై విరుచుకుపడ్డాడు. అరెస్టు చేయిస్తానని గర్జించారు. మునసబు ప్రవర్తనను ప్రజలు తెలియజేశారు. బసవయ్యనువదిలిపెట్టి, జరిగినదంతా తహసీల్దారుకు, సబ్‌కలెక్టరుకు తెలియపరిచారు. మునసబు ఆసరాచూచుకొని ఏమో - వర్తకులు ప్రజాసేవకులపై దొంగ కేసులు పెడుతున్నట్లు తెలుస్తూంది.

ఇలాంటి అధికారుల ప్రవర్తనవల్ల దొంగ వ్యాపారుల ఆగడాలు శృతిమించి, కరువు సమస్య మరింత తీవ్రంకాగలదు. ప్రజాద్రోహులయిన ఈ దొంగవ్యాపారుల నెదుర్కొనుటలో అధికారులు ప్రజలకు తోడ్పడాలి. ప్రజలు, ప్రజాసంస్థల నాయకత్వాన ఏకముఖంగా నిలిచి, అధికారులు తమకు తోడ్పడేలా చేయాలి.

సత్తెనపల్లిలో

సత్తెనపల్లి (గుంటూరుజిల్లా) లో దొంగ వ్యాపారుల దోపిడీ నానాటికి దుర్భరమవుతోంది. టోకువర్తకులు బస్తా 1 కి రెండేసి రూపాయిలు ఎక్కువేసిగాని అమ్మటంలేదు. పైగా తూకంలో తప్పుడుతూనికలు. ఇక తాలూకాలోని గ్రామాల్లో రూపాయికి మూడు శేర్లు దొరకడం కూడా కష్టంగావుంది. కూలి చేసి పొట్టగడుపుకునేవారికి అసలే చాలీచాలని కూలి - దానికితోడు దొంగవ్యాపారులదురాశ. లోగడ ఒకసారి జిల్లాకలెక్టరు సత్తెనపల్లికి వచ్చినప్పుడు తాలూకా ఆహారకమిటీవారు ఈ పరిస్థితుల నన్నిటిని వివరించారు. దొంగమార్కెట్టును అరికట్టి, స్టాకును కంట్రోలుచేసి, గ్రామాలకు సక్రమంగా బియ్యం అందేలా చేయాలని కోరారు. వారి వినతి - తహశీల్దారుకు అప్పగించిపోయారు. ఆయన గ్రామాలకు పర్మిట్లు రాసిఇచ్చి, దానితో అంతా చక్కబడినట్లు కూర్చున్నాడు. ఈ నిర్లక్ష్యాన్ని పోగొట్టడానికి, కరువు పరిష్కారానికి, ప్రజలను సంఘటిత పరచుతూ తాలూకాఆహారకమిటీ కృషిచేస్తోంది.

పల్నాడు తాలూకాలో

గతమాసం ఒకనాడు దాచేపల్లి గ్రామానికి మాచెర్ల భీమవతి లారీ 40 బస్తాల జొన్నలతో వచ్చింది. అప్పటికి ఎన్నాళ్లనుంచో ఆ గ్రామ ప్రజలు బియ్యానికి మొగం వాచిపోయారు. బియ్యం లేకపోతేపోయె, జొన్నలైనా ఇప్పించండని లారీచుట్టూమూగారు. కాని రూపాయికి 2¼ శేర్లకన్న తక్కువ ఇస్తానంటాడు ఆలారీలోని గుమాస్తా. కంట్రోలురేటు అద్దెడు 11 గిద్దలు - దానికి లారీచార్జీ కలుపుకోమని ఎంతచెప్పినావినలేదు. ఆపైనిగురజాలలోఉన్న తహశీల్దారుకు కబురుపంపారు ఆహారకమిటీవారు. ఆయన లారీయజమానిని పిలిపించి, 20 బస్తాలు దాచేపల్లి ఆహారకమిటీకిచ్చి, మిగిలిన 20 గురజాలకు తీసుకురమ్మన్నాడు.

పిడుగురాళ్లలో కూడా ఇలాగే దొంగ వ్యాపారం సాగుతూంటే, వివరాలు తెలుసుకొని, ఆహార కమిటీవారు తహశీల్దారుకు తెలియపరిచారు. ఈ వ్యాపారాన్ని అరికట్టవలసిందని ఆయన రెవిన్యూ ఇన్‌స్పెక్టరుకు ఉత్తరువు పంపాడు. ఆ గ్రామంలో వడ్డవల్లి పున్నయ్యగారిఇంట్లో 75 బస్తాలు, జూలకల్లు లైసెన్సుదారింట్లో 25 బస్తాల జొన్నలు బయటపడ్డాయి. వడ్డవల్లి పున్నయ్య - తన క్రోధం పట్టలేక, స్థానిక యువజనసంఘ కార్యదర్శి అయిన పి. ఆజాద్‌ను నానా బూతులుతిట్టి, కొట్టాడు.

దుర్గి అనే గ్రామం పల్నాడు తాలూకాలో, కర్నూలుజిల్లా సరిహద్దు దగ్గరుంది. ఆగ్రామములో ఈఏడు మెట్టపంటలు సరవాలేదనిపించాయి. అయినా ఈనాడు అక్కడిప్రజలు ఆహారధాన్యాలకు అల్లాడిపోతున్నారు. బియ్యం అసలేలేవు. జొన్నలు రూపాయికి 3¼ శేర్లు, సరిగలు 3¼ శేర్లు. అవయినా షావుకారు గుమ్మందగ్గర పడిగాపులుకాస్తేనే దొరుకుతవి. ప్రక్కనున్న ఓబులేసుపల్లిలో కూడా ఇవే పరిస్థితులు.

రాయలసీమకుతులతూగుతాయి గుంటూరు జిల్లాలోని సత్తెనపల్లి, పల్నాడు తాలూకాలు. గత నాలుగేళ్ళదట్టి ఇతర తాలూకాలనుండి వస్తున్న బియ్యం వగయిరాలు ఈ తాలూకాల ప్రజలను చాలవరకు కరువుబాధలనుండి కాపాడగలిగాయి. కాని ఈఏడు అవలేవంటు పోదయాయి. దానికితోడు రవాణా సౌకర్యాలు సరిగాలేక, ఇతర తాలూకాలనుండి కావలసినంత సరుకురాలేదు. ఆపైని దురాశాపరుల దొంగవ్యాపారం. ఇక అక్కడి పరిస్థితులు వేరే చెప్పనక్కరలేదు. ఎంత ప్రయత్నించినా బియ్యం దొరక్కపోవడంవల్ల ఒకామెకు ప్రసవించిన ఏడు రోజులవరకు అన్నంపెట్టలేదట. మొన్న జరిగిన పల్నాడు తాలూకా రైతుమహాసభకు వచ్చిన ఒకరైతు తన గ్రామంలోని ఈవిషాదగాధను చెప్పారు. కొన్ని గ్రామాల్లో నీటికరువుకూడా దాపురించింది. పేదకుటుంబాలు తమకున్నకాస్త అమ్ముకొని మాగాణి ప్రాంతాలకు వెళ్ళడం జరుగుతూంది. అంటే-పరిస్థితులవిలాగేసాగనిస్తే ఆ రెండు తాలూకాల్లోనూ గ్రామజీవనమే విచ్ఛిన్నంకాగల పరిస్థితు లేర్పడతాయన్నమాట. అధికారులు వెంటనే మేల్కొనాలి. దొంగవ్యాపారాన్నరికట్టి, గ్రామ అవసరాలకు కావలసిన సరుకును సక్రమంగా సప్లయి చేయాలి. ఈ విషయంలో ప్రజాసంస్థల సహకారాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి. చౌకడిపోలద్వారాగాని, కో-ఆపరేటివ్‌స్టోర్సు ద్వారాగాని కంట్రోలుధరలకు ఆహారపదార్థాలు, ఇతర జీవితావసర పదార్థాలు ప్రజలకు అందుబాటయేలా చూడాలి.

గుంటూరు తాలూకాలో

పొన్నెకల్లుగ్రామం గుంటూరుజిల్లాలోనిది. దీని జనాభా 5200. (మిగతా 8 వ పేజీలో)

★ విశాఖపట్నంజిల్లాలో

కార్మికనాయకుల అరెస్టు

చిట్టివలస కాంగ్రెసు (జ్యూట్) లేబరు యూనియన్‌పై పోలీసువారి మితిమీరిన పోరు న్నది. చిట్టివలస కార్మికులు జూలై 3 వ తేదీన జిల్లా కలెక్టరుతో తమకష్టాలను నివేదించుకోటానికి నిశ్చయించుకున్నారు. జూలై 1 వ తేదీ రాత్రి 7 గంటలకు 3 వేల మంది కార్మికులు, 300 మంది స్త్రీలతో సహా భోజనాలు చేసి యూనియన్ ఆఫీసువద్ద డెప్యుటేషన్ వెళ్ళటానికని కూడారు. కామ్రేడ్ భద్రం కూడ అక్కడే వున్నారు.

ఇంతలో, పోలీసులు తయారయ్యారు. విశాఖపట్నంపోయే రోడ్డుమీద నిలబడ్డారు. పోలీసు అధికారులు కార్మికులు జిల్లాకలెక్టరు వద్దకు డిప్యుటేషన్ తీసుకుపోవటానికి వీల్లేదని, కార్మికులను అక్కడనిలిపివేశారు. కార్మికులు జిల్లాకలెక్టరుకు విజ్ఞాపనచేసుకునే హక్కు తమకున్నదని వాదించారు. కార్మికులు శాంతంగానేవున్నారు. తరువాత కామ్రేడ్సు భద్రం, ఇప్పర జోగారావు, దుక్కా అప్పలస్వామిగార్లను అరెస్టు చేశారు. కార్మికులలో తీవ్ర అసంతృప్తి హెచ్చింది. స్త్రీలు ముందుకువచ్చి యీ డెప్యుటేషనును లేవదీసింది మేమే. వారినెందుకు అరెస్టు చేస్తారని పోలీసు అధికారులను ప్రశ్నించారు. విశాఖపట్టణానికి సాగిపోవటానికి కార్మికులు బయలుదేరబోతున్నారు. పోలీసులుతుపాకులు పైకెత్తి గురిచూస్తున్నారు. కామ్రేడు భద్రం పుర్షులను యిది సమయంకాదన్నారు. నూటికి నూరుమంది యూనియన్‌లోచేరి అధికోత్పత్తి పాలసీని ఆచరణలో పెట్టుటద్వారానే తమ కోర్కెలు నెరవేరుతాయని యెలుగెత్తిచాటాడు. కార్మికులు విన్నవదనులై, తమ నాయకుని యందున్న గౌరవ విశ్వాసాలను నిరూపిస్తూ తమయిండ్లకు తిరిగి వెళ్ళిపోయారు. ఇటీవలనే ప్రభుత్వం డిటెన్షన్‌నుండి వదలింది. భద్రాన్ని మళ్లీ అరెస్టు చేసింది.

చిట్టివలస కార్మికులను అహ్వానించటానికని వైజాగ్‌లో వివిధకార్మికసంఘాలవారు ఆయత్తమయ్యారు. కాని చిట్టివలస వార్త వారిని కంపింపచేసింది. ఆరోజు సాయంత్రం చిట్టివలసలో అరెస్టుచేయబడిన కార్మిక నాయకులను విడుదలచెయ్యాలని కోరుటకు బహిరంగసభ జరిగింది. కామ్రేడ్ రామలింగయ్య మాట్లాడారు. పోలీసు నిర్బంధపు విధానం అధికోత్పత్తిపాలిసీని ఆటంకపరుస్తుందని. దేశరక్షణకు అధికాహారోత్పత్తి పాలిసీని అమలుజరపటానికి అరెస్టు చేయబడిన వారిని వెంటనే విడుదలచెయ్యాలని తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదింపబడింది.

కామ్రేడు రామలింగయ్యను పోలీసులు చుట్టుముట్టారు. కాని వారంటు లేకపోవడం వల్ల అతణ్ణి కామ్రేడు రామలింగయ్యను అరెస్టు చేయలేకపోయారు. తరువాత రాత్రి 9 గంటలకు అరెస్టుచేశారు.

యం. యస్. యం. రైల్వే యూనియన్ రజితోత్సవం

21, 22, 23 తేదీలలో జరపాలి

కామ్రేడ్సు వి. నరసింహమూర్తి. వి. వి. కె. రావుగార్లు ఇట్లు వ్రాస్తున్నారు.

ఎం. ఎస్. ఎం రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ 1919 సంవత్సర మందు స్థాపించబడ్డది. అంటే 25 సంవత్సరాలయింది యూనియన్ స్థాపించి. మొదట పెరంబూరు కార్మికులతోనే యేర్పడింది యూనియన్. రైల్వేలైను అంతటా వ్యాపించే టట్లు చెయ్యటానికి 1927 నుంచి చాలమంది వర్కర్సు కృషిచేశారు. తత్ఫలితంగా యూనియన్ యీరోజున లైనంతటా వ్యాపించింది. 12 బ్రాంచీలు యేర్పడ్డయి 20 వేల మంది సభ్యులుగా చేరారు.

మన రాష్ట్ర కార్మికోద్యమంలో రైల్వే యూనియన్ అగ్రగామిగా నున్నది. యూనియన్ అనేక పోరాటాలు నడిపింది. రైల్వే కార్మికులకు అనేక సౌకర్యాలు కలుగచేసింది. పనిచేయు షరతులలో (సర్వీస్ కండిషన్స్) పనివారలకు అనుకూలంగా ఉండేటట్లు అనేక మార్పులు కలిగేటట్లు చేసింది. గ్రేడులలో మార్పులు కలుగచేసింది. అధికారులచే యూనియన్ గుర్తింపబడ్డది.

ప్రజానీకానికి రైల్వేకార్మికులు అత్యంత సేవచేస్తున్నారు. రైళ్ళ రాకపోకలను భద్రంగా కాపాడి, ప్రమాదాలులేకుండా చేస్తున్నారు. జీవితావసరాల సరఫరా త్వరితగతిని జరిపిస్తున్నారు. యుద్ధావసరాల రవాణా కుంటుపడకుండా రైళ్ళను నడుపుతున్నారు. ఈ విధంగా అకుంఠితమైన సేవచేస్తున్న రైల్వేకార్మికుల కష్టాలు ప్రజానీకం గమనించాలి. అవి నివారించుకోటానికి సహకారం యివ్వాలి.

జూలై 21 నుంచి 23 వరకు రజతోత్సవం జరుగుతుంది. మనదేశంఎదుర్కొంటున్న క్లిష్టపరిస్థితులలో రైల్వేకార్మికులు తమకర్తవ్యాన్ని గుర్తించాలి. దేశరక్షణలోతమపాత్రనుతెలుసుకొని వెంటనే కార్యాచరణకు పూనుకోవాలి. యూనియన్‌లో 100కి 100 గురు సభ్యులుగా చేరాలి.

ఈ రజతోత్సవంలో ప్రజానీకం యితర కార్మికసంఘాలుపాల్గొని జయప్రదం చెయ్యాలని కోరుచున్నాము.

బెజవాడ రైల్వే (బొగ్గు) కార్మికుల డెప్యుటేషన్

రైల్వే లోకోషెడ్‌లో బొగ్గు పనిచేసే కార్మికులుంటారు. వీరుచేసే పని చాల కష్టమైనది. కొన్ని లేక పనులుకూడా [illegible] యిప్పుడిచ్చే జీతాలమీదనే యివ్వవలెను. లేక పనులు సీనియారిటీ ప్రకారం యివ్వాలని యీ కార్మికులు కోరుతున్నారు.

ఇటీవలనే సబ్‌స్టిట్యూట్సును (క్రొత్తగా పనిలో ప్రవేశించినవారు) బొగ్గు [illegible] ఖాయపరిచారు. వాళ్ళు మిగిలినవారికి [illegible]యర్సు. కాని వీరిని లేకపనులకు వినియోగించి సీనియర్సును కష్టమైన బొగ్గుపనులలోనే వుంచుతున్నారు.

తమకు జరుగుచున్న యీ అన్యాయాన్ని ఎ. పి. ఓ. దొరకు (అసిస్టెంటు పర్సనల్ ఆఫీసరు) తెలియచేయటానికి ఒక జమాయిందారు మహబూబుతో 120 మంది డెప్యుటేషన్ వెళ్ళారు. మహబూబు తీసుకొని 2—7—44 తేదీ పెద్దకు వచ్చి విచారణ చేస్తానని చెప్పారు. కాని రెండవ తేదీ నాటికి దొరగారు విచారణ చేయటానికి రాకపోయేటప్పటికి కార్మికులు 3 వ తేదిని మళ్ళీ డెప్యుటేషను వెళ్ళారు. దొర తనకు అస్వస్థతగా వుండటమువల్ల ఆదివారంనాడు రాలేదని. మళ్లీ వచ్చే ఆదివారంనాడు. తప్పక వచ్చి విచారణచేసి న్యాయంకలుగ చెప్తానని తెలియచేశారు.

★

స్వీకారం

రైతుగీతాలు

రచయిత : పెద్దిబోయిన ప్రసాదరావుగారు

వెల : రెండణాలు

ప్రతులకు : ప్రజాశక్తి ఆఫీసు, గుడివాడ.

★

వీరవిజయం (ఖండకావ్యం)

రచయిత : రేమిడిచర్ల వెంకటకృష్ణారావు గారు

వెల : పావలా

ప్రతులకు :

ఆర్. వి. కృష్ణారావు, రేమిడిచర్లపోస్టు, వయా యెర్రుపాలెం, యస్. యస్. ఆర్.

★

వీరాంజలి (పద్యకదానికలు)

రచయిత : అంబటిపూడి వెంకటరత్నం గారు

వెల : అర్ధరూపాయి

ప్రతులకు : సాహితీమేఖల ప్రచురణలు, కొండాపురం, చండూరుపోస్టు, నల్లగొండ జిల్లా, నైజాం

★

నేటినటుడు (మూడు నాటికలు)

రచయిత : కొప్పరపు సుబ్బారావుగారు

వెల : రూపాయి

ప్రతులకు : నవజీవన్ గ్రంధమాల, తెనాలి

చేనేతకార్మికుల సమావేశం

రేపల్లె తాలూకా చేనేత పారిశ్రామికుల ద్వితీయమహాసభ నగరంలో 22-6-1944 తేదీన జరిగింది. రెండు ఎడ్లబండ్లమీద ప్రత్యేకముగ ఆహ్వానించబడిన వి. యస్. మూర్తి, ప్రగడ కోటయ్య, బాలనాగు, మహాసభ అధ్యక్షులైన అకురాతి లక్ష్మయ్యగార్లను ఊరేగించారు. 500 మంది చేనేత కార్మికులు వూరేగింపులో పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం సభ జరిగింది. శ్రీ అకురాతి లక్ష్మయ్యగారు సభకు అధ్యక్షత వహించారు.

కార్యదర్శి గత సంవత్సరంచేసిన కృషిని గూర్చి రిపోర్టు యిచ్చారు. ఈ తాలూకాలో 13 చేనేత కేంద్రాలున్నాయని అందులో 12 కేంద్రాలలో గ్రామసంఘాలు యేర్పడినవని. మొత్తం 1125 మంది సభ్యులున్నారని తెలియచేశారు.

లక్ష్మయ్యగారు తమ అధ్యక్షోపన్యాసం చదివారు. వి.యస్. మూర్తిగారు (మాజీపార్లమెంటరీ కార్యదర్శి) చేనేతగుడ్డ వుత్పత్తికి, ఎగుమతులకు, సౌకర్యాలు గల్గించాలని, మిల్లునూలుమీద కంట్రోలు యేర్పరచి చేనేతగుడ్డమీదకూడ కంట్రోలు యేర్పరచాలని తెలియజేశారు. అలా కంట్రోలు లేకపోతేచేనేత కార్మికులు నష్టపడతారని అన్నారు.

ప్రగడకోటయ్యగారు మిల్లుయజమానుల వల్ల చేనేతకార్మికులకు జరుగుచున్న అన్యాయాలను గూర్చి వుపన్యసించారు. కామ్రేడు కస్తూరి కుటుంబరావు యీ విధంగా వుపన్యసించారు: నేతగుడ్డను వుత్పత్తిచేసే చేనేత కార్మికుడు తన కూలిని మాత్రమేపొందుకొని నేతగుడ్డను వర్తకుడు విక్రయించుతాడు. నేత గుడ్డపైన కంట్రోలు లేకపోతే వర్తకుడు విపరీతలాభాలు వేసుకొని ప్రజాసామాన్యానికి బట్ట అందుబాటులో లేకుండా చేస్తాడు. యెక్కువలాభాలు వేసుకోడం చేనేతమిల్లు గుడ్డతో పోటీచెయ్యలేక పోతుంది. నేతగుడ్డ మిగిలి నేతకార్మికులకు పనులులేకుండా పోతాయని తెలియజేశారు అందువల్ల నేతగుడ్డ మీద కంట్రోలు వుండటం ప్రజలకు చేనేత కార్మికులకు కూడ లాభకరమని తెలియజేశారు.

తీర్మానాలు

జాతీయనాయకులను వెంటనే, బేషరతుగా విడుదలచెయ్యాలని; దొంగమార్కెటులు అరికట్టాలని; అఖిలభారత చేనేతబోర్డులో చేనేత కార్మికులకు 2/3 వంతు ప్రాతినిధ్యంవుండాలని చెన్నరాష్ట్ర చేనేత పారిశ్రామిక సంఘంవారి తీర్మానాన్ని బలపరుస్తూ తీర్మానాలుచేశారు.

★

తెనాలిలో ముఠా కార్మికుల తగాదా

ఎరువుకొట్లవద్ద పనిచేసే కార్మికులు జీవితావసరాల ధరలు పెరిగినందున తమ కూలి రేట్లు పెంచమని షాహుకార్లను అడిగారు. షాహుకార్లు కార్మికుల కోర్కెను పూర్తిగా నెరవేర్చకపోయినను రూపాయికి 0-4-0 పెంచారు. కాని పిండిమరలు దూరముగా నుండుటవల్ల పిండి తోలటానికి రేటు చాలదని యెక్కువ రేటు కోరారు. షాహుకార్లు తమ యూనియన్ని సమావేశపరచి కార్మికులనిరాకరించారు. యూనియన్‌నాయకులలో వొకరైన బుడా సాహెబును యే షాహుకారు పనులకు పిలువరాదని 19-6-44 తేదీన తీర్మానించారు. ఒకపోటీముఠాను తయారుచేశారు. కార్మికులకుఅసంతృప్తిఅధికమయింది. కాని, కార్మికుల యూనియన్ చెప్పిపోకుండాచూస్తున్నది.

గోదావరిపుష్కరాలలో ★ ప్రజారక్షణదళం ★

— మా విలేఖరి

ఈసారిగోదావరి పుష్కరాలు. అంతులేనిజనం, మళ్ళాపన్నెండేళ్లకోగాని ఈమహాపుణ్యకాలం సంప్రాప్తించదనే విశ్వాసంతో, ప్రయాణసౌకర్యాలు లేకపోయినా, అధికంగా అనేకఇబ్బందులు పొందుతున్నా, లెక్కచేయకుండావచ్చారు. పిల్లాజెల్లా, ముసలీముతకా, అనే విచక్షణలేకుండా తండోపతండాలుగా వచ్చేశారు.

వచ్చారె అనుకోండి. తీరిపోయిందా? గోదావరిలో మునిగి ఒడ్డెక్కేటప్పటికి ఎంత కష్టం. తడిబట్టలతో ఒడ్డెక్కడంవల్ల అప్రదేశమంతా నానిపోయి, జారుడు ఎక్కువగా వుంటుంది. కాళ్లుజారి, పడటం సంభవిస్తుంది. గోదావరిలో మునిగినవారి చిత్తం "పాండురంగడిమీదో ఆంజనేయులవారి మీదో" వున్నా, శక్తిమాత్రం ఒడ్డునవున్న మూటల మీద ఉండాల్సివస్తుంది. ఇంతేగాదు. పిల్లాజెల్లా నీటిలో ఎక్కువలోతుకు పోతారేమో, ఏంఅపాయం కల్గుతుందో అనేభయం పీడిస్తూ వుంటుంది.

స్నానపు రేవులలో

అయితే దీనికి మార్గంలేదా? లేకేం? జరుగో ప్రజారక్షణ దళం. వాళ్ళ పుణ్యమా అంటూ స్నానపు రేవులలో రెండువ్రక్కలా కాపులకట్టారు. అకాళ్ల ఆసరాతో జారకుండా ఒడ్డెక్కవచ్చు. ఇంతేగాక, తర్ఫీదిచ్చిన వాళ్ళ సాయంతో ఒడ్డెక్కేవారు. ఒడ్డున వున్న మూటలను పోకుండా చిటుగాచి రోజు నీళ్ళలో బిడ్డలు మునిగిపోకుండా కాపాడి, సహాయపడ్డారు.

ఎలాగో ఒడ్డెక్కారనుకోండి. గోదావరి తీరాన ఉన్న పాండురంగణ్ణి, ఆంజనేయుల్ని దర్శించాలంటే ఎంత కష్టం? ఆ దేవుళ్ళు - ముఖ్యంగా పాండురంగడు. కొద్ది ఆవరణ తోనే సంతృప్తిపడి నివసిస్తున్నాడు. అలాంటప్పుడు గర్భగుడిలోకి వెళ్ళడమే కష్టం. వచ్చేవాళ్ళు, పోయేవాళ్ళ రద్దీ యెక్కువ. స్త్రీ పురుషుల జనసమ్మర్దం. వచ్చేవారంతా భక్తులేనా? కొందరికి స్త్రీల, శిశువుల వంటిమీది నగలపై దృష్టి వుంటుంది. మరికొందరు స్త్రీలను అవమానపరచడానికి సాహసిస్తారు. ఈ సందడిలో పిల్లలూ, తల్లులూ వేరవడం కూడా అసాధ్యం కాదు.

దేవాలయాలలో

కాని ఇలాంటి దేమీ సంభవించకుండా ప్రజారక్షణదళం చక్కని ఏర్పాట్లు గావించింది. "లోనికి" ఒకమార్గం, "బయటికి" మరోమార్గం ఏర్పరిచింది. పాండురంగ దేవాలయంలో గర్భగుడిలోనికి పురుషుల కొకదారి, స్త్రీల కొకదారి ఏర్పరిచారు. పిల్లల్ని ఆ సందడిలో తప్పిపోకుండా జాగ్రత్తపడుచుటలో స్త్రీ వలంటీర్లు బాగా పనిచేశారు.

ఆరోగ్యరక్షణ

తమ ఆరోగ్యాన్ని చెడగొట్టుకోకుండా వుండటమేగాక, ఇతరుల ఆరోగ్యాన్ని చెడగొట్టే పనులేవీ చేయరాదనే సంగతి పాపం చాలామంది యాత్రికులకు తెలియదు. దుకాణాలలో కన్పడ్డ ప్రతివస్తువూ తింటారు. అదుపులో వుంచకపోతే అల్పాచమానం ఎక్కడచేయాలో తెలియదు. ఇలాంటి సమయాలలో కలరా మొదలైన వ్యాధులు వ్యాపించడానికి అవకాశం వుంటుంది. అందుకని ఆరోగ్యరక్షణ ప్రధానకర్తవ్యం.

ప్రజారక్షణదళం దుకాణాలలో చెడిపోయినవీ, కుళ్లినవీ, తినుపదార్థాలులేకుండా తనిఖీ చేయించారు. ప్రజలకుమరుగుదొడ్లకుమార్గాలను చూపించేవారు. ఎప్పటికప్పుడుమరుగుదొడ్లను శుభ్రం చేయించడం, ఫినాయిలు సున్నం వేయించుట చేసేవారు. ఇదిగాక ఎగ్జిబిషన్ విజ్ఞానమందిరంరోడ్లను తుడిపించి, నీళ్లుచల్లించారు. "పుష్కరకమిటీ"వారు ప్రథమ చికిత్సకు కావలసిన మందులు సప్లయి చేయలేదు. అయినా, డాక్టర్ వీరయ్యగారు తన శక్తికొలది సాయంచేశారు. కలరా రాకుండా కొంతమందికి ఇంజెక్షన్లు ఇచ్చారు. వలంటీర్ల ప్రథమ చికిత్సాలయంలో దాదాపు 200 మంది ప్రథమచికిత్స పొందారు.

ప్రదర్శనశాలలో

ప్రజారక్షణదళం అనేకవిధాలుగా ప్రజలకు [illegible] ప్రమాదం [illegible] అప్పచెప్పారు. ఇలా చెప్పాలంటే చాలా వున్నాయి.

తప్పిపోయినపిల్లల్ని ఒక ఆటస్థలంలో వుంచి తల్లిదండ్రులకు అప్పగించేవారు. ఇలా 70 మంది పిల్లలను వాళ్ళ తలిదండ్రులకు అప్పజెప్పారు. పోయిన వస్తువులను తాలి యజమానులకు అప్పజెప్పారు. ఇంకా యజమానులెవరో తెలియని 6 వస్తువులను "పుష్కరంకమిటీ"కి అప్పజెప్పారు. దొంగల్ని పట్టుకొని, వారి వద్ద వస్తువులను స్వంతదారుల కిప్పించారు. స్త్రీల విషయంలో అసభ్యంగా ప్రవర్తించిన రౌడీలకు బుద్ధిచెప్పి, వాళ్ళచేత మాఫ్లు చెప్పించుకొని వదిలిపెట్టారు. ఎగ్జిబిషన్‌లో రోజూ జరిగే జాతర వచ్చేజనాన్ని వద్ద కంట్రోల్ చేశారు. స్టాల్ యజమానులకు కూడ అనేకరకాలుగా సహాయపడ్డారు.

యాత్రికుల ప్రశంస

ఈ విధంగా 70 మంది వలంటీర్లు (అందులో స్త్రీ వలంటీర్లు 6 గురు) ప్రజాసేవచేసి, ఆరోగ్యశాఖాధికారిచేత, "పుష్కర కమిటీచేత ప్రశంసలు పొందారు. "ప్రజారక్షణ దళం లేకపోతే నానా అవస్థలు పడేవాళ్ళం నాయనా" అంటూ యాత్రికులు తమ కృతజ్ఞతను వెలిబుచ్చారు. ఈ వలంటీర్లందరికి జనరల్ కమాండర్‌గా టి. యస్. చాలాతీదాసుగారు పనిచేశారు. మరికొందరు సెక్షనల్ కమాండర్లుగా పనిచేశారు.

దక్షిణాఫ్రికాలో భారతప్రజాఉద్యమం

గత సంవత్సరం దక్షిణాఫ్రికా పార్లమెంటులో ప్యాసుఅయిన 'పెగింగ్ఆక్టు' విషయం అందరికీ తెలిసిందే. దాని ప్రకారం భారతీయులు డర్బాన్‌నగరమందలికొన్నిప్రాంతాలలో నివసించకూడదు. ఇండ్లు, స్థలాలు సంపాదించకూడదు. అనగా భారతీయులు తమకు ఏర్పరిచిన ప్రత్యేక ప్రాంతాలలోనే (గూడెములలో) వుండాలి. ఇతరచోట్లకు వ్యాపించకూడదు. ఈ శాసనాన్ని ప్రపంచమంతా ఆక్షేపించింది. నాగరికులు 20 వ శతాబ్దంలో యీజాతి విచక్షణ ఏమిటన్నారు. ప్రపంచ ప్రజలంతా ఫాసిస్టుకూటాన్ని ఓడించటానికి భుజంభుజం కలిపి పోరాడుతుంటే. యీరంగు విభేదాలను ఆఫ్రికా ప్రభుత్వం లేవనెత్తడంఘోరమైనఅన్యాయమన్నారు. ఈ ప్రజా ఆందోళనకు జంకి. ఆఫ్రికా ప్రభుత్వం 'పెగింగ్ ఆక్టు'ను రద్దుచేసికోవలసి వచ్చింది.

లైసెన్సింగు బోర్డు

కాని వెంటనే నేటాల్ శాసనసభ ఒక ఆర్డినెన్సును ప్యాసు చేసింది. దీని ప్రకారం ఒక 'లైసెన్సింగు బోర్డు' నిర్మించబడింది. ఆసియావాసులు ఎవరైనా కొత్తప్రాంతాలకు వెళ్ళాలన్నా, ఇండ్లు కట్టుకోవాలన్నా 'లైసెన్సింగు బోర్డు' అనుమతిని పొందాలి. అనగా భారతీయులపై నిర్బంధాలు ఒకచేత్తో తీసివేసి, మరోచేత్తో ప్రవేశపెట్టారన్నమాట. అన్నిటికంటె విషాదకరమైన సంగతి ఏమిటంటే నేటాల్ భారతీయ కాంగ్రెసు వర్కింగుకమిటీ సభ్యులు 14 గురు యీ మార్పును అంగీకరించారు. పెగింగ్ ఆక్టును రద్దుచేస్తూ, లైసెన్సింగు బోర్డును నియమించడానికి యీ పెద్దమనుషులు తమ సమ్మతిని తెలిపారు.

కాని దక్షిణాఫ్రికా భారతీయులు యీ అక్రమాన్ని సహించలేదు. తమను ద్రోహం చేసిన నేటాల్‌కాంగ్రెసునాయకులను తీవ్రంగా నిరసించారు. మే 14 వ తేదీన డర్బాన్ నగరంలో బ్రహ్మాండమైన సభ జరిపారు. దీనికి 10 వేలమంది హాజరయ్యారు. పెగింగ్ ఆక్టును రద్దు చేశామంటూ దొడ్డిత్రోవను 'లైసెన్సింగ్ బోర్డు' ద్వారా అదే రంగు భేదాన్ని ప్రవేశపెట్టారని ఖండించారు. హెచ్. ఎ. నాయుడు ఉపన్యసించుతూ లైసెన్సింగ్‌బోర్డుకు అంగీకరించిన కాంగ్రెసు నాయకులు దక్షిణాఫ్రికా భారతప్రజల ప్రతినిధులు కారన్నారు. ఈబోర్డును రద్దుచేయించడానికి భారతీయులంతా కలసి పోరాడాలని హెచ్చరించారు.

ఈ పోరాటంలో భారతీయులు ఒంటరిగా లేరు. డర్బాన్ కమ్యూనిస్టుపార్టీ భారతీయులను బలపరచింది. వివిధకార్మికసంఘాల ప్రతినిధులు సభకు హాజరయ్యారు. భారతీయుల హక్కులను బలపరచారు. జిల్లా కమ్యూనిస్టుకమిటీ సభ్యులు హోమ్ మంత్రి వద్దకు రాయబారం వెళ్లారు.

పెట్టుబడిదారులే జాతీయవిభేదాలను రెచ్చగొట్టడానికి కారకులని, భారతీయులు వేరుగా ప్రత్యేకదేశాలలో వుండాలనడం అక్రమమని రాయబారవర్గం తెలియజేసింది. రంగువిభేదాలను తొలగించడానికి మానవలసివుంది. ఎట్టి షరతులు లేకుండా పెగింగ్‌ఆక్టును, లైసెన్సింగ్‌బోర్డును రద్దుచేయాలంది. యూరోపియనులతో పాటు ఆఫ్రికాలోవున్న ప్రజలందరికి వోటింగ్‌హక్కు యివ్వాలని కోరింది. జాతీయవిద్వేషాన్ని, రంగుభేదాలను రెచ్చగొట్టేవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. జాతీయవిచక్షణను చూపే శాసనాలన్నిటినీ రద్దుచేయాలంది. రాష్ట్రప్రభుత్వాలు అలాంటి విచక్షణనుచూపే శాసనాలుచేస్తే, వాటినికూడ రద్దుచేయాలని కోరింది.

మే 20, 21, తేదీలలో మరల జాతివిచక్షణకు వ్యతిరేకంగా జోహెన్స్‌బర్గ్ నగరంలో మహాసభ జరిగింది. దీనికి 6 లక్షలు పైగా భారతీయుల, ఆఫ్రికాప్రజల, తరపున 540 మంది ప్రతినిధులు హాజరయ్యారు. రైతు సంఘాలు, కార్మికసంఘాలు, రాజకీయ పార్టీలు, మొదలైన 373 ప్రజాసంస్థలకు వీరు ప్రతినిధులు.

నిషేదాలు, నిర్బంధాలు

దక్షిణాఫ్రికాలో తెల్లవారు పాలకవర్గంగా వున్నారు. తమ పెత్తనాన్ని అధిక సంఖ్యాకులుగావున్న ఆఫ్రికావాసులపైన, భారతీయులపైన కొనసాగించడానికి, వారిపై అనేక నిషేధాలు ప్రయోగించారు. వీటినే 'ప్యాసు లాస్' అంటారు. వీని ప్రకారం నల్లవాళ్ళు.

1. అనుమతిపత్రం లేకుండా పెద్ద పట్టణాలలోనికి రాకూడదు.
2. రిజిష్టరు కాంట్రాక్టు వుంటేతప్ప పట్టణప్రాంతంలో పనిచేయకూడదు.
3. ఒకనల్లవాడు తామందే ప్రాంతంనుంచి కదలాలంటే, అనుమతిపత్రం వుండాలి.
4. ట్రాన్స్‌వాల్‌లో ఆఫ్రికనులు ఇంట్లోనుంచి కదలాలంటే ప్యాసు దగ్గరుంచాలి.
5. దక్షిణాఫ్రికాయూనియన్‌లోఎక్కడైనా సరే పన్నుకట్టిన రసీదులు దగ్గరుంచుకొని, అడిగినవారికల్లా చూపించాలి.

జోహన్స్‌బర్గ్ మహాసభ యీశాసనాలను తీవ్రంగా ఖండించింది. ఇవి మిత్రరాజ్యాల ఆశయాలకు పూర్తిగా విరుద్ధమైనవని తీర్మానించింది. అక్రమమైన 'ప్యాసులా'ను రద్దుచేయాలని కోరుతూ 10 లక్షలమంది సంతకాలతో పిటీషను పెట్టాలనినిర్ణయించింది. ఈశాసనాలు ఆఫ్రికన్‌ప్రజల స్వాతంత్ర్యాన్ని ఎలా అరికట్టుతున్నాయో ఉపన్యాసకులు తెలియజేశారు. 1939—41 సంవత్సరాలలో ప్యాసులులేకుండా వెళ్ళినందుకు 8 లక్షల మంది ఆఫ్రికన్ ప్రజలు అరెస్టుచేయబడ్డారు. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెసు అధ్యక్షుడు డాక్టర్ ఎ బి. క్సూమా యిలా ఉపన్యసించారు: "ఇతరులను అణచివుంచే మనిషి తాను నిజంగా స్వతంత్రుడుగా వుండలేడు. దక్షిణాఫ్రికాలో మూడువంతులు బానిసత్వంలో వుంటే ఒక వంతు స్వతంత్రంగా వుండ కాలదు."

కార్మికుల ఊరేగింపు

సమావేశ అనంతరం నగరవీధులలో బ్రహ్మాండమైన ఊరేగింపు జరిగింది. కమ్యూనిస్టు పార్టీ 25 వేల కార్మికులుగల యీ ఊరేగింపులో పాల్గొంది. పార్టీకార్యదర్శి మోజెస్ కోటని యీ అక్రమశాసనాలను రద్దుచేయాలని ఉపన్యసించారు. ఈవిధంగా కొందిమంది సామ్రాజ్యవాదులు జాతివిభేదాలను, రంగువిచక్షణను రెచ్చగొడుతున్నారు. అక్రమశాసనాలు చేస్తున్నారు. కాని ప్రజాసామాన్యం అంధులు కాదరులే. జోహన్స్‌బర్గు సభ, ఊరేగింపు యీ సౌభ్రాతృత్వాన్నే తెలుపుతున్నాయి. జాగృతిచెందుతున్న రంగుజాతుల ప్రజలు, భారతీయులు, తెల్ల కార్మికులు అందరూకలసి జాతివిచక్షణ చేసే అక్రమశాసనాలను రద్దు చేయాలని కోరారు. ఆఫ్రికా ప్రజలందరికి రంగుభేదం లేకుండా పౌరసత్వ హక్కులుండాలని ఎలుగెత్తి చాటారు.

బుధవారం ప్రజాశక్తి 12-7-44

చిట్టివలస కార్మికనాయకుల అరెస్టు

ఆంధ్రదేశంలో విశాఖజిల్లా జూట్ పరిశ్రమకు కేంద్రం. చిట్టివలస, నెల్లిమర్లలలో ముఖ్యమైన జనపనారమిల్లులు పనిచేస్తున్నాయి. వీటి పెట్టుబడి యూరోపియన్లవి. పనిచేసే కార్మికులు ఆంధ్రులు. యుద్ధకాలంలో యజమానులు యీపరిశ్రమ ద్వారా విపరీతలాభం పొందుతున్నారు.

జీవితావసర వస్తువులన్నిటిధరలు యుద్ధఫలితంగా విపరీతంగా పెరిగాయి. అందులో విశాఖజిల్లాలో గతసంవత్సరంలో వచ్చిన తుపాను ఫలితంగా పంటలు పాడయినాయి. అందుచే కరువుపరిస్థితులు ఏర్పడి ధరలు మరింత హెచ్చాయి. వీటన్నిటివల్ల కార్మికుల జీవితవ్యయం హెచ్చింది. కాని దానితోపాటు జీతాలు హెచ్చులేదు. స్వల్పంగాయిచ్చిన హెచ్చుధరల అలవెన్సు ఏమూలకూ సరిపోవడం లేదు.

చిట్టివలస కాంగ్రెస్ లేబరుయూనియన్ జూట్ కార్మికుల యిబ్బందులను నివారించడానికి కృషిచేస్తోంది. స్వర్గీయ కరుణాకరం సుబ్బారావుగారి కాలంనుంచి యూనియనులో కమ్యూనిస్టు కామ్రేడ్స్ పనిచేస్తున్నారు. సుబ్బారావుగారి అనంతరం యూనియను కమ్యూనిస్టుల నాయకత్వంలో వుంటూంది. కామ్రేడ్స్ ఆగస్టు పటవల సందర్భంలో చిట్టివలసలో ఎలాంటి అల్లరులు జరగకుండాచూచారు. యుద్ధపరిశ్రమ అయిన జూట్‌మిల్లు ఉత్పత్తి సక్రమంగా జరిగేలా కృషిచేశారు. ఉత్పత్తిని హెచ్చు చేయడానికి కార్మికులు సహకారం చేయవల్సిందిగా ప్రచారంచేశారు.

కాని కార్మికసంఘాన్ని బలపరచుతూ ఉత్పత్తిని కాపాడిన కమ్యూనిస్టులపైన యజమానులు దాడి ప్రారంభించారు. వారికి కార్మికుల సంఘీభావం కొరగానివని. అధికారులకు తప్పుడు రిపోర్టులుచేసి డిఫెన్సురూల్సుక్రింద 1943 మార్చిలో సంఘ ఉపాధ్యక్షుడైన కామ్రేడ్ వీరభద్రాన్ని డిటెయిన్ చేయించారు. అనప్పటికి కామ్రేడ్స్ కార్మికులలో పనిచేస్తూవచ్చారు. యజమానులు రెడ్డి ఏర్పరచిన పోటీ సంఘాన్ని బలపరుస్తున్నారు. కాంగ్రెసు లేబర్ యూనియన్‌ను బహిష్కరించుతూ, నాయకులైన కమ్యూనిస్టులపై కల్పితరిపోర్టులను అధికారులకు పంపుతున్నారు. తత్ఫలితంగా గత ఏప్రియల్‌లో అధికారవర్గం యూనియన్ అధ్యక్షుడుగా ఎన్నుకోబడిన కామ్రేడ్ వెంకటేశ్వర్లును, మరిద్దరిని, అరెస్టుచేసి డిటెయిన్ చేసింది.

మే నెలలో కామ్రేడ్ వీరభద్రం డిటెన్షను నుంచి విడుదలయి వచ్చారు. మరల కార్మికులమధ్య పనిచేస్తున్నారు. కార్మికుల యిబ్బందులను జిల్లా కలెక్టరుకు తెలియజేయడానికి రాయబారం తీసుకెళ్ళడానికి నిర్ణయించబడింది. జూన్ 1వ తేదీన రాయబారం వెళ్ళటానికి సిద్ధంగావున్న కామ్రేడ్స్ భద్రాన్ని, జోగారావు, అప్పలస్వామిగార్లను పోలీసులు అరెస్టుచేశారు. రాయబారవర్గాన్ని ఆహ్వానించడానికి విశాఖపట్టణంలో కార్మికులసభ జరిపారు. ఆ సభలో ఉపన్యసించిన కామ్రేడ్ కొన్నలగడ్డ రామలింగయ్యను జూన్ 2వ తేదీన పోలీసులు అరెస్టుచేశారు.

అరెస్టు కాబడ్డ కామ్రేడ్స్ బాధ్యులైన కమ్యూనిస్టులు. ఉత్పత్తిని కొనసాగించుతూ, కార్మికుల హక్కులను రక్షించాలనేది నేడు కమ్యూనిస్టుపార్టీ పాలసీ. చిట్టివలస కార్మికనాయకులైన కామ్రేడ్స్ కార్మికుల ప్రాథమిక హక్కులకోసం నిలబడ్డారు. ఉత్పత్తిని కొనసాగించుతున్నారు; కార్మికుల యిబ్బందులను అధికారులకుతెలిపి వాటినితొలగించుకోడానికి రాయబారంబయలుదేరారు. రాయబారంవెడలడం కార్మికుల న్యాయమైన హక్కు. ఇంతమాత్రానికే కామ్రేడ్స్‌ను అరెస్టుచేయడం స్థానికాధికారుల నిరంకుశత్వ మనిపించుకొంటుంది.

కాబట్టి ప్రభుత్వం వెంటనే అరెస్టుచేయబడిన కార్మికనాయకులను విడుదల చేయాలి.

స్థానికాధికారులుచేసిన యీ అరెస్టులను చూచి కార్మికులు రెచ్చకూడదు. తమ డ్యూటీలో నిలబడి పనిచేస్తూనే తమ నాయకుల విడుదలకోసం కృషిచేయాలి. ఉత్పత్తిని కొనసాగించడం నేడు దేశరక్షణ కార్యక్రమంలో భాగం. తమ నాయకులను విడుదలచేయించుకోడం తమ సంఘబలాన్ని వృద్ధిచేసుకొనే కార్యక్రమంలో ఒకభాగం. ఈ రెండిటికోసం చిట్టివలస కార్మికసోదరులు కృషిచేయాలి.

★ మన రాజకీయాలు

లీగ్ - కాంగ్రెసు ఐక్యతకు మహత్తరమైన అవకాశం

జిన్నా - రాజాజీ ఉత్తర ప్రత్యుత్తరాలు

— కంభంపాటి సత్యనారాయణ

హిందూ - ముస్లిం సమస్యను పరిష్కరించడానికి రాజాజీ జిన్నాగారికి చేసిన కొన్ని సూచనలు పత్రికలలో ప్రకటింపబడ్డాయి. అవి మహాత్ముని ఆమోదాన్ని పొందాయి. అవి ఏమంటే:

1. భారతీయుల సంపూర్ణ స్వాతంత్ర్య వాంఛను ముస్లింలీగ్‌కూడా బలపరచాలి. తాత్కాలికంగా యేర్పడబోయే జాతీయ ప్రభుత్వ నిర్మాణానికి ముస్లింలీగ్ కాంగ్రెసుతో సహకారం చేయాలి.

2. దేశానికి పశ్చిమోత్తరభాగంలోను, తూర్పుభాగంలోను ముస్లింప్రజలు అధిక సంఖ్యాకులుగావున్న ప్రాంతాలకు సరిహద్దులు నిర్ణయించడానికి యుద్ధానంతరం ఒకకమిటీని నియమించబడాలి. ఆ విధంగా సరిహద్దులు నిర్ణయం జరిగిన ప్రాంతాలలో వయోజన వోటింగ్ పద్ధతి ప్రకారంగాని, ఆచరణ యోగ్యమైన మరేయితర వోటింగ్ పద్ధతి ప్రకారంగాని, అక్కడ నివసించే ప్రజలందరి అభిప్రాయం తెలుసుకోవాలి. ఆయాప్రాంతాలు భారతదేశంనుండి విడిపోవడమా? లేక కలిసి ఉండడమా? అనే సమస్యను నిర్ణయించేది అక్కడి ప్రజల అభిప్రాయం. మెజారిటీ అభిప్రాయం విడిపోవడానికి అనుకూలంగా వున్నట్లయితే, ఆ నిర్ణయం అమలు జరుగుతుంది. అయితే, అట్టి ప్రాంతాలకు సరిహద్దులలో ఉన్న ప్రజలు ఏ ప్రభుత్వంలో చేరదలచుకుంటారో ఆ ప్రభుత్వంలో చేరడానికి ఎట్టి అటంకం ఉండకూడదు.

3. ఇట్టి ప్రజానిర్ణయానికి ముందు అన్ని పార్టీలవారు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా ప్రచారం చేసికొనవచ్చు.

4. ఏప్రాంతమైనా భారతదేశం నుండి విడిపోయినప్పుడు ఉభయప్రభుత్వాలు కలిసి రక్షణ, వాణిజ్యం, రాకపోక సౌకర్యాలు, మొదలైన ముఖ్యవిషయాలపై పరస్పరఒడంబడిక చేసుకోవాలి.

5. ప్రజలను ఒకచోటినుండి మరొకచోటికి మార్పడం ఆ ప్రజల యిచ్ఛానుసారంగానే జరగాలి.

6. పరిపాలనాధికారాన్ని బ్రిటన్ భారతీయులకు ట్రాన్స్‌ఫర్ చేసిన పక్షంలోనే పైషరతులు ఉభయపార్టీలకు వర్తిస్తాయి.

జిన్నాగారికి రాజాజీవ్రాసినలేఖలు

1944, ఏప్రిల్ 8వ తేదీని రాజాజీ జిన్నాగారికి యీ క్రిందివిధంగా జాబువ్రాశారు:

"ప్రియమైనజిన్నాగారూ! 1943 మార్చిలో నేను గాంధీజీతో సంప్రతించినప్పుడు (21 రోజుల ఉపవాస సమయంలో) యీ సూచనలను గాంధీజీఅంగీకరించారు. అవి హిందూ-ముస్లిం సమస్యా పరిష్కారానికి పునాది. అవి అందరికీ న్యాయంగా ఉంటాయనే విషయంపై నేను మిమ్మల్ని ఒప్పించగలిగితే, గాంధీజీ తన అంగీకారాన్ని మీకు తెలియజేయవలసినదిగా నాకు అధికారం ఇచ్చారు. రాజీకొరకు ప్రభుత్వం ఆయనకు ఎట్టిఅవకాశం ఇవ్వకుండా, ఆయనపై గల నిర్బంధాలను ఏమాత్రమూ సడలించడానికి పూనుకొనకుండ ఆయినప్పటికీ నేను మీకు వ్రాస్తున్నాను. ఇందుమూలంగా హిందూ-ముస్లింసమస్య పూర్తిగా పరిష్కరించబడి, ప్రతిష్టంభన అంతమొందు తుందని ఆశిస్తున్నాను. పైషరతులకు నేను గాంధీజీ అంగీకారాన్ని పొందినప్పుడు నా సంతోషం ఇంతా అంతాకాదు. ఈ సూచనలతో ఎంతన్యాయం, ఎంతబలం ఉన్నదో చూచుటకై మీరు జాగ్రత్తగావాటినిపరిశీలిస్తారని ఆశిస్తున్నాను. దేశంలో అన్నిమూలల విస్తారంగా వ్యాపించియున్న ప్రతిష్టంభనను అంతంచేయడంలో మీరు తోడ్పడుతారని విశ్వసిస్తున్నాను."

ఏప్రిల్ 17వ తేదీని రాజాజీ జిన్నాకు తిరిగి యీక్రింది లేఖను వ్రాశారు:

"క్రిందటిసారి నేను మిమ్మల్ని ఢిల్లీలో కలుసుకున్నప్పుడు లిఖితపూర్వకంగా మీకంద చేసిన ప్రణాళికను మీరు తిరిగి చదివి, ఆలోచించియుంటారని భావిస్తున్నాను. ఆ సూచనలను మీరు అంగీకరింపజాలనందుకు నాకు ఆశాభంగం కలిగింది. అయినా, మీరు వాటిని గురించి మరొకసారి ఆలోచిస్తారని నమ్ముతున్నాను. పరిష్కారాని కవి న్యాయమైన, సంతృప్తికరమైన, పునాది అని నేను హృదయపూర్వంగా విశ్వసిస్తున్నాను. వాటిని గురించి మీరు తిరిగి ఆలోచింపారో, లేదో తెలుసుకొనగోరుతున్నాను."

దీనికికూడాజిన్నాగారినుండిజవాబురాలేదు. మహాత్ముడు మేనెల 6వ తేదీని విడుదల చేయబడ్డారు. ఐక్యతకు చక్కని అవకాశం లభించింది. ఉభయపార్టీల నాయకులు సంప్రదింపులు జరపడానికి యిక ఎవరూ అటంకం పెట్టజాలరు. ఈ అనుకూల పరిస్థితులు చూచి రాజాజీ జిన్నాకు జూన్ 30వ తేదీని యీ విధంగా టెలిగ్రాం యిచ్చారు:

"నా రెండు జాబులకు మీరు జవాబీయలేదు. నేను గాంధీజీని కలుసుకొని మాట్లాడాను. పై ప్రణాళికకు ఆయన ఇప్పటికీ తన అంగీకారాన్ని తెలియజేస్తున్నారు. ఆప్రణాళికను, మీ నిరాకరణను, పత్రికలలో ప్రకటించడం నా కోరిక. గాంధీజీ అంగీకారంతోనే నేనీ టెలిగ్రాం పంపుతున్నాను. నేటి క్లిష్ట పరిస్థితులలో మీ నిరాకరణను గురించి తిరిగి ఆలోచించవలసినదిగా కోరుతున్నాను."

జిన్నా జవాబు

దీనికి జిన్నాగారు యీనెల2వతేదీన క్రింది విధంగా జవాబు పంపించారు:

"ప్రణాళికను ప్రకటించే విషయంలో మీ అభిప్రాయాన్ని చూచాను. మీ ప్రణాళికను నేను నిరాకరించినట్లు తెలియజేయడం న్యాయంకాదు. అదిచూచి నేను ఆశ్చర్యపోయాను. యదార్థపరిస్థితులు ఏమంటే, ప్రణాళికలో ఎట్టిమార్పులకు అవకాశంలేదని మీరు చెప్పారు. అయినప్పటికీ నేను దాన్ని ముస్లింలీగు వర్కింగుకమిటీ ఎదుట పెడతానని చెప్పాను. అందుకు మీరంగీకరించలేదు. కనుక, తదుపరి ఎట్టిచర్య తీసుకోలేకపోయాను. నా- (మిగతా 6వ పేజీ)

పసిఫిక్ యుద్ధంలో మార్పు

చైనాను లొంగదీయడానికి జపాన్ ఎత్తులు

— మోహన్ కుమారమంగళం

పసిఫిక్ మహాసముద్ర యుద్ధంలో జూన్ 19న పెద్ద మార్పువచ్చింది. అరోజున అమెరికానౌకలు, 1000 మైళ్ళు ముందుకు గుంపు పోయాయి. సింగపూర్ నుండి న్యూగినీగుండా మార్షల్ దీవులవరకు వున్న జపానుదీవుల వెలుపలి రక్షణశ్రేణులను ఛేదించుకొని అమెరికను నౌకలు ముందుకు పోయాయి. ఇంతేగాదు, ఫిలిప్పైన్స్ దీవులను ట్రక్-మార్కస్ దీవులగుండా క్యూరైల్ దీవులవరకు వున్న లోపలి రక్షణశ్రేణిని కూడా ఛేదించుకొని పోయాయి అమెరికానౌకలు. టోక్యో జపాను సరిగ్గా 1000 మైళ్ళలో వున్న మారియానా దీవులపై అమెరికన్ సైన్యాలు దిగాయి. జూన్ 15వ తేదీన ఈ దీవులలోని ముఖ్య దీవియైన సైపాన్‌లో అమెరికా సైన్యాలు కాలుపెట్టాయి. ఈనాడు సైపాన్ పూర్తిగా అమెరికా చేతిక్కింది.

విజయం సంవత్సరంలో సంభవించుటుందా?

ఇదేరోజున, దక్షిణ జపానులో అమెరికన్ బాంబర్లు అగ్నివర్షం కురిపించాయి. (ఇప్పటికి మూడుసార్లు జపానుపై ఇలా బాంబులవర్షం కురిసింది.) మరొకవారంలో అమెరికా నౌకలకు-జపాను నౌకలకు యుద్ధం జరిగింది. జపాను తోకముడిచి పారిపోయింది. కాని ఈ యుద్ధంలో విపరీత నష్టాలు పొందినా, జపాను నౌకాదళం పూర్తిగా నాశనం కాలేదు. అయినప్పటికి ఇది అమెరికానౌకలకు పెద్ద విజయమే.

అయితే ఈవిజయాల అంతరార్థంఏమిటి? అమెరికా ఉపాధ్యక్షుడైన హెన్రీవాలాస్ అన్నట్లు "చైనా-ఆసియా-పసిఫిక్‌లలో ఈ సంవత్సరంలో యుద్ధం పూర్తిఅవుతుంది" అని ఆశించవచ్చా?

అమెరికా నౌకాబలం

ప్రపంచంలోకల్ల బలమైన నౌకాదళం ఈనాడు అమెరికాకువుంది. అందుచేతనేప్రతి దీవిని ఒక్కొక్కటి వశపరచుకొనే పద్ధతిని మాని, కొన్ని దీవులను వదిలేసి ప్రక్కగా దాటగల్గిన శక్తి వచ్చింది. గ్వాడల్ కెనాల్ నుండి న్యూగినీలోని హాలండియాలోకి ప్రవేశించడానికి-అంటే 1000 మైళ్ల ప్రయాణం చేయడానికి, దాదాపు 18 నెలలు పట్టింది మొదట. కాని ఇపుడు హాలండియా-మార్షల్ దీవులనుండి మారియానా దీవులకు-అంటే 100 మైళ్ళురావడానికి రెండు నెలలైనా పట్టలేదు. హాలండియాలో దిగిన 2 నెలలకే ఈదండయాత్ర ప్రారంభమయింది.

జపానులో సంక్షోభం

పసిఫిక్ యుద్ధంలో మొదట అతిసులభంగా కొన్ని విజయాలు సాధించినా ఈనాడు ఆత్మరక్షణలో పడింది జపాను. ఈనాటి మహాయుద్ధాలకు యంత్రాలవసరం. జపానులో దాదాపు 25 నుండి 30 లక్షలమంది కార్మికులు మాత్రమే పెద్ద పరిశ్రమలలో పనిచేస్తున్నారు. అమెరికా-కనడా-బ్రిటన్‌లలో కోట్లకొలది పనిచేస్తున్నారు. అమెరికా నెలకు 8500 విమానాలకు ఉత్పత్తిచేస్తోంటే, జపాను 1200 మాత్రమే చేయగలుగుతోంది. ఇదిగాక జపాను నౌకా నష్టాలుకూడ విపరీతంగా వున్నాయి. రూజ్‌వెల్టు చెప్పిన ప్రకారం నెలకు లక్ష 30 వేల టన్నుల జపాను నౌకలనుమిత్రబలాలు ముంచివేస్తున్నాయి.

జపాను సంవత్సరానికి 10 లక్షలటన్నులకన్నా ఉత్పత్తి చేయలేదు. అంటే అమెరికా ఉత్పత్తి చేసేదానిలో 20వ వంతు అన్నమాట. చివరకు 100-150 టన్నులకోయిట్ట నావలను ఉత్పత్తి చేసికొనే స్థితికి జపాను దిగిందంటే, సంక్షోభం ఎంత తీవ్రమైందో ఆలోచించండి. జపాను ప్రజలలోకూడ తీవ్ర అసంతృప్తి పెరిగింది.

పరిస్థితులింత క్లిష్టంగా ఉన్నంతమాత్రాన జపాను అప్పుడే ఓడిపోయిందని అనుకోకూడదు. ఎలాగో [illegible]కాలవ్యవధిసంపాదించాలని జపాను ప్రయత్నించుకోంది. మారియానాదీవులవద్దజరిగిననౌకా యుద్ధంలో అటో ఇటో తేల్చుకోకుండా జపాను పారిపోవడం చూస్తేజపానుతననౌకలను, జపానుదగ్గరనూ దానిచుట్టూ రాకపోకలను రక్షించుకోనేందుకు మాత్రమే ఉపయోగించదలచుకుంది అని తోస్తుంది. ఇదేకాలంలో తన ముఖ్యసేనలను చైనాబర్మాలలో కేంద్రీకరించి పోరాడుతోంది. "యుద్ధం - కార్మికవర్గం" అనే పత్రికలో సోవియట్ రచయిత జకావ్ ఇలా వ్రాశారు: "యుద్ధంలో విజయం అసంభవమనుకొని, జపాను రాజకీయ ఎత్తులలోకి దిగింది. ఇది వరకు సంపాదించిన భూమినైనా నిలబెట్టుకొనే అపేక్షతో వ్యూహాలను పన్నుతోంది. శాంతి సూచనలను ఈ ఉద్దేశంతో ప్రారంభించింది."

జపాను ఎత్తులు

రాజకీయంగాను, సైనికంగాను జపాను వేసే ఎత్తులేమిటి? పెకింగ్ - కాంటన్ రైల్వేనంతా ఆక్రమించి, ఇదివరకులా సముద్రమార్గాలమీద ఆధారపడకుండా రైళ్ళద్వారానే చైనాలోపోరాడే తనసైన్యాలకు సహాయం పంపాలని జపాను వాంఛిస్తోంది. ఇప్పుడు సాగించిన తీవ్రయుద్ధాలలో లోయాంగ్ - చాంగ్‌షాలను పట్టుకొంది. కాంటన్‌నుండి ఉత్తరానికి దాడి ప్రారంభించింది. చాంగ్‌షా యుద్ధాలలో అటో ఇటో తేలకపోయినా, జంగ్-కై-షేక్ అన్నట్లు పరిస్థితులు ప్రమాదకరంగానే ఉన్నాయి. ఇంతేగాక చైనాలోని అమెరికా విమాన కేంద్రాలనుగూడ పట్టుకోవాలని జపాను ప్రయత్నించుతోంది.

దానితోపాటు అస్సాం - బర్మా యుద్ధరంగములో, ఆత్మరక్షణకోసం, కాదే ముందుగా యుద్ధాలు సాగించుతోంది. అంటే చైనాకు భూమార్గం ఏర్పరచాలనే ఉద్దేశ్యంతో మిత్రసైన్యాలు చేసే దండయాత్రను భగ్నం చేయడానికే; ఇటీవల ఇంఫాల్ - దిమాపూర్ రంగంలో యుద్ధం సాగించింది.

భారతదేశంలో రాజకీయప్రతిష్టంభన ఇలా కొనసాగినన్నాళ్లు, జపాను ఇలాంటి దాడులు సాగించి, మిత్రసైన్యాల దండయాత్ర వ్యూహాలను భగ్నంచేయడానికి చూస్తుంది.

చైనాలో

చైనాలో కొమిన్‌టాంగ్‌పక్షంలో కొందరు జపానుకన్నా కమ్యూనిస్టులంటే భయపడే రకం వున్నారు. వాళ్ల పలుకుబడి ఫలితంగా పశ్చిమోత్తర రాష్ట్రాలలో, చైనా ప్రభుత్వం కొన్ని ముఖ్యసైన్యాలను కమ్యూనిస్టులకు కాపలాగా నిలిపివేసింది. సన్‌యట్-సేన్ సతి, మొదలుకొని నీగ్రోగాయకుడైన పాల్‌రాబ్సన్ వంటి కళావేత్తవరకు, ఈ కాపలాగాయడం మాని, ఆ సైన్యాలను జపానుపైకి త్రిప్పండి అనికోరుతున్నారు. ఇంతేగాదు. "యుద్ధము-కార్మికవర్గం" అనే సోవియట్ పత్రిక కూడ గతజూన్‌లో "ప్రస్తుత చైనాపరిస్థితులే చైనా పరాజయాలకు కారణం. ఎంతో అంగబలంవున్నా, పరిశ్రమలను, మిలిటరీని బలపరచేప్రయత్నం జరగడంలేదు; చైనా సేనాయకులలో కొందరింకాభూస్వామ్యయుగాలనాటివాళ్లున్నారు. ఇంతేగాక లొంగిపోదామనే ధోరణివాళ్లుకూడ ఉన్నారు." ఈ విషయాన్నే రెడ్‌స్టార్‌పత్రిక వ్యాఖ్యాతకూడా ఈనాడు చెప్పుతున్నారు. ఈబలహీనతను జపాను ఉపయోగించుకొనచూస్తోంది.

అమెరికా ఉపాధ్యక్షుడు చైనాలోని అంతరంగిక పరిస్థితులను చక్కబరచడానికి ప్రయత్నించాడని తెలుస్తుంది. అతడు చైనా వద్చారు. చైనాకు సహాయంవస్తుందని హామీ ఇచ్చారు.

కాని వుత్తమాటలతో లాభంలేదు. ఇంకా చేయవలసింది చాలావుంది. సైపాన్ (మారియానా)నుండి జపానుపై బాంబులను కురిపించడానికి అమెరికాకు వేదిక దొరికినమాట నిజమే. అయినా, జపానునౌకలను పూర్తిగా నాశనంచేయడానికి, జపాను ముఖ్యదీవులపైనే దెబ్బ తీయడానికి, అవసర కీలకస్థానాలింకా వశంకాలేదు. ఫిలిప్పైన్సు - చీనాతీరం చేరడానికి ఇంకా చాలాకాలం పడుతుంది.

కాని ఈలోగా చైనాలో ఏం జరుగుతుంది, బర్మాలో ఏం [illegible] చైనా-ఇండియా [illegible] ఇలాగేవుంటే [illegible] ప్రక్క [illegible] లొంగదీస్తుందా? [illegible] దీర్ఘ కాలం కొనసాగించు[illegible] ముఖ్య సమస్య.

భారత ప్రతిష్టంభన, చైనాలో [illegible] ఉన్నంతకాలం పసిఫిక్ యుద్ధ[illegible] కాజాలదు. అమెరికా నౌకలు [illegible] సాధించినా, చైనాలో సంక్షో[illegible] తుంది. అమెరికా చైనాకు సహా[illegible] తన కర్తవ్యాన్ని స్పష్టపరచింది. [illegible] కై-షేక్, కమ్యూనిస్టు వ్యతిరేకుల[illegible] చెప్పి చైనాలోని ఐక్యతను బలపర[illegible]

జపానుకు ఉన్న అవకాశం [illegible] దీర్ఘ కాలం సాగింది. సంధి [illegible] ద్వారా, చైనాను చేరువచేయ[illegible] నేడు సత్వరంగా భారత ప్రతిష్టంభన[illegible] చేయాలి. చైనాలో ఐక్యతై[illegible] జపాను అనుకూలురను తొలగించాలి. రెండూ ఎంత త్వరగా జరిగితే, అంత [illegible] బర్మారోడ్డు స్వాధీనమయి చైనాకు [illegible] జరుగుతుంది. భూ సముద్ర [illegible] సంయుక్తంగా నడిపి పసిఫిక్ [illegible] జపానును ఓడించడం సులభమవుతుం[illegible]

బెర్లిన్ వైపు రెడార్మీ పురోగమనం

నాజీ జర్మనీపై సమ్మెటపోటువెంట సమ్మెటపోటు తగులుతోంది. సోవియట్ యుద్ధరంగంలో ఆయువుపట్టులైన కీలకస్థానాలొకటొకటిగా సోవియటుసైన్యం చేజిక్కుతున్నాయి. మిన్‌స్క్, పొలాట్స్క్, మోలొడెచ్నో, బారనోవిచ్, లిడా, కోవెల్ వంటి కీలకస్థానాలను వశపరచుకొన్నాయి. లిథూనియా గుమ్మంలోని విల్నాలో ప్రవేశించింది. సోవియటు సేనలు జర్మనులను హతమారుస్తున్నాయి. ఈ విజయాలన్నీ రెడార్మీని బెర్లినుకు మరింత దగ్గరకు చేరుస్తున్నాయి.

సోవియటు ఈ విజయాలను శరవేగంతో సాధించుతోంది. గుండెనిబ్బరంచెడిన జర్మను సేనలు సేనాధిపతులు ఆయుధాలు క్రింద పారవేసి వశమవుతున్నారు. ఇప్పటికి 15 మంది జర్మను సేనానాయకులు వశమయ్యారు.

ఫ్రాన్సులో కాన్ మిత్రసేనల వశమయింది. కాన్ వశమవడంవల్ల పారిస్ పురోగమించడం సులభమవుతుంది.

ఇటలీలోకూడా, ఉత్తరఇటలీలోని సైన్యాలను ఖాళీచేసి సోవియటు రంగానికి పంపాలని ఆలోచిస్తున్నారు హిట్లరు.

కొత్త రహస్య ఆయుధాలను కనిపెడుతున్నాం అంటూ ఒకప్రక్క బెదిరిస్తూ ప్రక్క-వందిసూచనలను హిట్లరుగావిస్తు[illegible] కాని ఈ సూచనలన్నీ నిష్ఫల[illegible] తప్పదు. అందుకనే గొబెల్సు "అంతా నాశనమైపోతుందనుకొన్న జర్మను ప్రజలు ఎంత తీవ్రంగా పోరాడుతారో గమనించండి" అంటూబెదరిస్తున్నారు; ఒకవైపు బెదిరింపులు, మరోప్రక్క సంధి బేరాలు సాగింపుల సాగించి నాజీజర్మనీ బ్రతికి బయటపడదామని ఆశిస్తోంది. కాని దానికి అడియాసగాక తప్పదు.

(4వ పేజీ తరువాయి) అభిప్రాయంఏమంటే, దాన్ని అంగీకరించడంగాని, నిరాకరించడంగాని నాచేతులోలేదు. ఇప్పుడు కూడా నేను అదేఅభిప్రాయాన్ని కలిగియున్నాను; ఇన్నా దైనా గాంధీజీ తన ప్రణాళికను నాకు నేరుగా పంపించినట్లయితే ముస్లింలీగ్‌వర్కింగు కమిటీయెదుట పెట్టడానికిసిద్ధంగానేవున్నాను."

దీనికి రాజాజీ యీనెల 4వ తేదీని క్రింది విధంగా జిన్నాకు టెలిగ్రాం యిచ్చారు:

"మీ రిచ్చిన టెలిగ్రాముకు ధన్యవాదాలు. పైప్రణాళికను మీరు వ్యక్తిగతంగా నిరాకరించినట్లు నేనెందుకు అభిప్రాయ పడవలసివచ్చిందో నేను ఏప్రిల్ 17వ తేదీని వ్రాసిన జాబులో తెలియజేశాను. కాని, యిప్పుడు మీరు దాన్ని నిరాకరించనట్లుగా తెల్పుతూన్నందుకు సంతోషిస్తున్నాను. ఈ విషయంలో గాంధీజీకి ఎవరూ, ఎట్టి అధికారాన్ని యివ్వకపోయినా, నా ప్రణాళికను ఆమోదించారు. ఆ ప్రధాన సూత్రాలపై మీతో రాయబారాలు నడపడానికి ఆయన నన్ను నియమించారు. ఇప్పుడు తిరిగి తన ఆమోదాన్ని తెలియజేస్తున్నారు. నా ప్రణాళికను మీరంగీకరిస్తే, గాంధీజీయొక్క అభిప్రాయంతో కాంగ్రెసు ముస్సాతికపాత్ర ఏకీభవించవచ్చు. కాని, మీరు ప్రణాళికను లీగ్ కౌన్సిల్ యెదుట పెట్టాలంటున్నారు. అట్టి విధానం వల్ల ప్రయోజనం ఉండదని నా అభిప్రాయం ఎందువల్లనంటే, మీరు ప్రణాళికను బలపరచడంలేదు."

తరువాత జిన్నాగారు రాజాజీకి యిచ్చిన టెలిగ్రాంలో, తాను అంతకంటె యేమీ చేయలేనని తెలియజేశారు.

ఈ ఉత్తరప్రత్యుత్తరాల ప్రాధాన్యతఏమంటే మహాత్ముడు మొట్టమొదటిసారి ముస్లిం ప్రజలు కోరే స్వయంనిర్ణయ హక్కును, విడిపోయేహక్కుతోసహా, స్పష్టంగా అంగీకరిస్తున్నారు. లీగ్ నాయకత్వంలో కూడా అనేకమంది గాంధీజీ ముస్లింలీగ్ కోరే స్వయంనిర్ణయసూత్రాన్ని అంగీకరిస్తే ఐక్యత సులభసాధ్యమవుతుందని ప్రకటనలు గావిస్తున్నారు. కాబట్టి లీగ్‌వర్కింగ్ కమిటీ పైప్రణాళికను నిరాకరిస్తుందనే అనుమానం ఉండనవసరంలేదు. జిన్నాగారుకూడా వర్కింగుకమిటీ యెదుట ప్రణాళికను పెట్టడానికి సిద్ధంగావున్నారు. మహాత్ముడు వ్యక్తిగతమైనదనికాలంహృదయంతోజిన్నాగారికి జాబువ్రాసి, సంప్రతింపులను ప్రారంభించడం అవసరం. ప్రధాన విషయంలో ఉభయనాయకులు ఏకీభవిస్తున్నప్పుడు, ఎవరు మొదట కదులుతారు? అనే చిన్నవిషయానికి ప్రాధాన్యత యివ్వరాదు.

★ రైతుసంఘ వార్తలు

గాదెవద్ద రు. 11 లు గిట్టునట్లు ధాన్యం ధర నిర్ణయించాలి

తూర్పు గోదావరిజిల్లా రైతుసంఘం 11—6—44 వ తేదీని ముంగండలో శ్రీ చిమ్మలకాయల రామన్ననాయుడుగారి అధ్యక్షతక్రింద సమావేశమై, యీ క్రింది తీర్మానాలు గావించింది :

1. దరలకంట్రోలు ఉత్తరువుననుసరించి ఈజిల్లాలో రెండవరకం ధాన్యం 166 పౌనుల బస్తాకు రు. 11-9-7 అని నిర్ణయించబడింది. ఈరేటు ఫ్యాక్టరీయజమానులకు, వర్తకులకు ఎక్కువ లాభంగావుంది రైతులకు గిట్టుబాటు కావలసినధర రావడంలేదు. ఎందువల్లనంటే, యీరేటులో సంచిఖరీదు, బందిఖర్చు, అమ్మకపుపన్ను, కాటా, కుట్టుడు — మొదలైన ఖర్చులుచేరి ఉన్నాయి. ఈ ఖర్చులు పోను రైతుకు బస్తా రు 10 కంటె గిట్టుటలేదు. ఒకసంచి కనీసం 10 పట్టుబడులకైనా పనికి వస్తుంది. కాని యిప్పుడు ఒకేపట్టుబడిపట్టిన సంచికి రు. 1 మినహాయిస్తున్నారు. ఇదిచాలా అన్యాయం. రైతు దగ్గర సంచి ఖరీదుకై 0-2-0 కంటె హెచ్చుగా మినహాయించరాదు. ఇలాగే యితర ఖర్చుల విషయంలో కూడ మిల్లుయజమానులు, కమీషన్ఏజంట్లు, రైతుల్ని మోసగించుటకు కవకాశంవుంది. అందువల్ల, ప్రభుత్వం బస్తా 1 కి రు. 11 చొప్పున గాదెవద్ద గిట్టునట్లు నిర్ణయించాలి.

2. పశ్చిమగోదావరి డెల్టా ఆయకట్టు ఎంత వున్నదో, తూర్పు - సెంట్రల్ డెల్టాల మొత్తం ఆయకట్టుకూడా అంతేవుంది. రెండవ పంటకు పశ్చిమడెల్టాకెంత ఆయకట్టుకు నీరు యివ్వబడుతోందో, తూర్పు - సెంట్రల్ డెల్టాలకు కూడా అంతకంటె ఎక్కువ నీరు ఇవ్వబడుటలేదు. ఆయకట్టు ననుసరించి ప్రొపోర్షనేటుగా రెండవ పంటకు నీరు యివ్వబడేటప్పుడు తూర్పుగోదావరిజిల్లావల్ల తమకు అన్యాయం జరుగుతోందనీ, అందువల్ల దామాషా నీటిపంపక విధానాన్ని ప్రభుత్వం రద్దుచేయవలసి యుంటుందనీ, పశ్చిమగోదావరి జిల్లాలో కొందరు ఆందోళన చేయడం విచారకరం. ఆనకట్టు ఎగువన గోదావరిలో విపరీతంగా మేటవేసిన యిసుకను తీయించుటకు, ఆనకట్టవెడల్పును పెంచుటకు, పోలవరం - శబరి ప్రాజెక్టులను నిర్మించుటకు ఉభయగోదావరి జిల్లాల రైతులు ఆందోళన చేయవలసిందిగా కోరుచున్నాము.

దొంగమార్కెట్లను అరికట్టాలి

28-6-44 వ తేదీని నెల్లూరుజిల్లా రైతుసంఘ కార్యవర్గం శ్రీ వి. కొండయ్యగారి అధ్యక్షతన సమావేశమై యీ దిగువ తీర్మానాలను ఆమోదించింది :

1. నిత్య వ్యాపారవస్తువులు జనతసామగ్రిని, కంట్రోలుబద్దను, దొంగ మార్కెట్లో విపరీత దరలకు అమ్మకుండా చేయడానికి ప్రభుత్వం ప్రతి తాలూకాలోను రైతుసంఘ ప్రతినిధులు, తదితరులుగల సలహాసంఘాలను ఏర్పాటు చేయాలి. దొంగ వ్యాపారంచేసే వారి నుండి సరుకును కమాండీర్ చేసి, కో-ఆపరేటివ్ స్టోర్సుద్వారా, వ్యవసాయడిపోల ద్వారా, అమ్మించాలి. ఇందుకై నెల్లూరుజిల్లా జమీన్ రైతుసంఘంవారు జిల్లారైతుసంఘంతో కలిసి కృషిచేయుటకు ఆహ్వానింపబడిరి.

2. మెరకప్రాంతాలలో సజ్జ, జొన్న, రాగి ధాన్యాలను రెక్విజిషన్ చేసేపద్ధతికి ఆమోదం తెలియజేస్తూ, వరదలవల్ల పంటసరిగాపండని ఆత్మకూరు తాలూకాల్లోని ప్రాంతాలను మినహాయించవలసిందని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. అంతేగాక, ధాన్యం కొనుగోలు పూర్తి అయిన వెంటనే పిర్కా-కేంద్రాలలో ఎప్పటికప్పుడు నైకం రైతులకు యిచ్చునట్లు చూడాలి. మెట్టప్రాంతాల పిర్కా-కేంద్రాలన్నింట్లోను ప్రభుత్వం చౌకడిపోల నేర్పరచాలి.

3. కోవూరు తాలూకా కోస్తాగ్రామాలలో మలేరియావల్ల 400 మంది మరణించారు. జిల్లా మొత్తంమీద 16 వేలమంది యీ వ్యాధితో బాధపడుతున్నారు. ఇందువల్ల వ్యవసాయం దెబ్బతినేటట్లుంది. కాబట్టి హెల్త్ డిపార్టుమెంటువారు, జిల్లాబోర్డు అధికారులు శ్రద్ధవహించి, తగు వైద్యసహాయం చేయాలి.

కమాండీరింగ్ పద్ధతిలో మార్పు అవసరం

కృష్ణాజిల్లా రైతుసంఘ కార్యవర్గం 28-6-44 వ తేదీని శ్రీ అనుమర్లపూడి సీతారామారావుగారి అధ్యక్షతక్రింద సమావేశమై యీ క్రింది తీర్మానాలు గావించింది.

1. ధాన్యం కమాండీరింగులోను, దరలు యివ్వడంలోను, జిల్లా పర్చేజింగ్ ఆఫీసరు, రివెన్యూడిపార్టుమెంటువారు వేర్వేరు పద్ధతుల నవలంబిస్తున్నారు. కాబట్టి పర్చేజింగ్ఆఫీసరు ఎప్పటికప్పుడుజిల్లాకలెక్టరుఎరుకతోనే ధాన్యం సేకరించాలి. స్థానికావసరాలను గుర్తించి సరుకును కమాండీరుచేయాలి. ధాన్యానికి పురి వద్దనే, సంచిఖరీదుతో సంబంధం లేకుండా, బస్తా 1కి రు 11 గిట్టునట్లు చూడాలి.

2. శాంక్షన్ అయిన బుడమేటిస్కీమును ప్రభుత్వం వెంటనే అమలు పరచాలి.

3. వ్యవసాయపనిముట్లకు పనికివచ్చే యినుమును క్రాప్లోన్ అండ్ సేల్సుసొసైటీలకు, కో-ఆపరేటివ్ స్టోర్సుకు ప్రభుత్వం సప్లయిచేయాలి. అవిలేనిచోట్ల ప్రభుత్వ డిపోలద్వారా అమ్మించాలి

మలేరియా నరికట్టి ఆహారోత్పత్తికి తోడ్పడుతున్నారు

నెల్లూరుజిల్లాలో రామతీర్థం తిరునాళ్లకు ప్రతియేట 50 వేలమంది వచ్చేవారు. కాని, దాదాపు 1 సంవత్సరంనుండి ఆప్రాంతాల్లో 4000 మందికి మలేరియావచ్చి, వారిలో 400 మంది మరణించారు. ఇతర గ్రామాలకు కూడా యీ వ్యాధి వ్యాపిస్తోంది. బీదరైతులు, కూలీలునెక్కువగా దీనికి గురిఅవుతున్నారు. వ్యవసాయం కుంటుబడుతోంది.

ఈ పరిస్థితుల్లో ఈయేడు రామతీర్థానికి ప్రజలు వెళ్లకుండా ప్రచారంచేసి, ఆవిధంగా వ్యవసాయాన్ని కాపాడాలని నిశ్చయించింది జిల్లారైతుసంఘం. ప్రచారకులు నెల రోజుల నుండి న్యూస్బోర్డులు, బహిరంగసభలు, కథలు, నాటకాలు మొదలైన వాటి ద్వారా 30 గ్రామాలలో ప్రచారంచేశారు. తత్ఫలితంగా ప్రమాదాన్ని ప్రజలంతా గుర్తించారు. 16-6-44 వ తేదీని తిరునాళ్ల ప్రారంభమైంది. ప్రతియేడు 50 వేలకుపైగా వచ్చేప్రజలు ఈ యేడు 1 వేయికంటె ఎక్కువరాలేదు.

అప్పాపురం ప్రాజెక్టుగ్రామాలలో

ఈ ప్రాంతం పల్లపుసాగు కావడంతో, మాగాణిలోని మురుగు మంచినీళ్ళ చెరువుల లోనికి ప్రవహించుతోంది. గత సంవత్సరం వందలాది ప్రజలు మలేరియావల్ల [illegible] దారు. ఒక్క చెరుకూరులోనే [illegible] 800 మంది చనిపోయారు. [illegible] కూడా యిది వ్యాపిస్తూంటే, కూలీ[illegible] వర్కుల్లు, వైద్యసౌకర్యాలు, కలిసి [illegible] దంవల్ల ప్రాణనష్టంతోబాటు కాపాడగలి[illegible] ఈ సంవత్సరం మలేరియా మళ్ళీ [illegible] చిరుతోంది. వర్షాలుకురవడం, పంటకా[illegible] లోనికి నీరు రావడంతో పాతజ్వరాలు [illegible] పెరుగుతున్నాయి. మాగాణిచేలలోపారదల[illegible] వెళ్ళిన కూలీలకు శిగంటల్లో ఒళ్ళుపులక[illegible] ప్రారంభమై, యిళ్ళకు తిరిగి వస్తున్నా[illegible] ఈయేడైనా ఆరోగ్యకాపాడారు [illegible] తీసుకొనకపోతే, యిదివరకు వ్యాధికి [illegible] అయినవారందరూ మంచంపట్టడం, [illegible] వారికి వ్యాధి వ్యాపించడం, కూలీలు దొర[illegible] పోవడం, సకాలంలో నాట్లు పూర్తి[illegible] పోవడం - జరుగుతుంది. పంటలన్నీ [illegible] తిని, ఆహారసమస్య మరింత విషమి[illegible]

రైతు - కూలీ ప్రచారకులు [illegible] వంతు కర్తవ్యాన్ని నెరవేర్చాలి. స్థానికం[illegible] ఉన్న వైద్యుల సహాయంతో ప్రజ[illegible] ఆరోగ్యసూత్రాలను బోధించాలి, [illegible] నిరోధించడానికి ఏ పద్ధతులవలంబాలో ప్ర[illegible]రం చేయాలి.

నీటిపారుదల వసతులకై రైతుల ఆందోళన

అనంతపురంజిల్లాలో అప్పరుపెన్నార్ (పేరూరు) ప్రాజెక్టు నిర్మాణంకొరకు ప్రభుత్వం యిటీవల ఒక స్పెషల్ డివిజనల్ కమిటీని నియమించి, మే 1 వ తేదీనుండి పని ప్రారంభించింది. నదిలో గుంటలుతవ్వి, ఎంత లోతులో గట్టినేల దొరకుతుందో పరిశోధించారు. కాని, ఇన్వెస్టిగేషన్ పూర్తికాక ముందే ప్రభుత్వం మే 28 వ తేదీని స్పెషల్ డివిజనల్ కమిటీని ఎట్టి కారణం తెలుపకుండానే, ఎత్తివేసింది. ఈ ప్రాజెక్టువల్ల ధర్మవరంతాలూకాలో సగంభూమి, కల్యాణదుర్గం తాలూకాలో కొంతభూమి, సాగు అవుతుంది. అనంతపురం, సింగనమల చెరువులకు నీరు పూర్తిగా ప్రవహిస్తుంది. ఈ స్కీమును ఇప్పుడు యెత్తివేయడంవల్ల ఆ ప్రాంతాల రైతులకు తీరని [illegible] కలిగింది. కనుక, మద్రాసు ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణాన్ని విరమించక, [illegible] కొనసాగించవలసిందని కోరుతూ ధర్మ[illegible] తాలూకా రైతుసంఘ ఆర్గనైజరు పి. [illegible]లప్పగారు ప్రకటిస్తున్నారు.

పిఠాపురం తాలూకాలో

గొర్రికండి అనే వంకకాలువపై పిఠాపుర[illegible] ఎస్టేటులో 18 గ్రామాలు, గొల్లప్రోలు ఎస్టేటులో 3 గ్రామాలు, ఉప్పాడ ఎస్టేటులో [illegible] గ్రామాలు, ఆధారపడివున్నాయి. కాని [illegible] గ్రామాలకు ఎగువలో కోలంక - కిర్లంపూడి ఎస్టేటువారు రెండు కాలువల మొగలో అడ్డు కట్ట కట్టడంవల్ల, పై 24 గ్రామాలకు నీరు అందుటలేదు. షుమారు 50 వేల యకరాల పంటకు నష్టంసంభవిస్తోంది. కనుక ప్రభుత్వం వెంటనే శ్రద్ధతీసుకొని, అడ్డుకట్ట సమస్యను పరిష్కరించవలసిందని కోరుతూ తూర్పు గోదావరిజిల్లా రైతుసంఘ కార్యనిర్వాహక వర్గ సభ్యులు, కె. బుల్లిరాజుగారు, ప్రకటిస్తున్నారు. తాలూకా యందలి వివిధగ్రామాలలో ఒకరైతుసంఘ ప్రచారకదళం యీవిషయమై తీవ్రంగా ఆందోళన చేస్తూంది.

ఎరువులకు అప్పు దరఖాస్తులు

రైతుల కిస్తున్న ఎరువుల అప్పు దరఖాస్తు ఫారాలు పనికిరావనో, సప్లయిలేదు అనో, బాపట్ల తాలూకాలోను, బందరుతాలూకాలోను, స్థానికాధికారులు ఆటంకాలు కల్పిస్తున్నారు. అధికారులు యిట్టి ఆటంకాలను తొలగించవలసిందని కోరుతూ పై రెండు తాలూకా రైతుసంఘాలు తీర్మానాలు గావించాయి.

ఈనాము రైతులకు విజ్ఞప్తి

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శి వందూరి ప్రసాదరావుగారిలా వ్రాస్తున్నారు:

ఈనాము గ్రాంటు సమయానికి మైనరు ఈనాములుగాని, పోరంబోకులుగాని ఉన్న ఎడల అట్టి ఈనాముగ్రాంటులు మద్రాసు ఎస్టేటులాండు ఆక్టు సెక్షను 3, క్లాజు 2 డి, ప్రకారం ఎస్టేట్లు కావనియూ, ఖండ్రికలు పూర్తి ఈనాముగ్రాంటులు కావనియూ, మద్రాసు హైకోర్టు వారిటీవల యిచ్చిన తీర్పువల్ల ఈనామురైతుల కష్టాలు హెచ్చాయి. ఈనాముదార్లు అప్పుడే వందలకొలదీ దావాలు వేసి రైతులను కోర్టుల కీడ్చుచున్నారు. రివెన్యూ కోర్టులలోని కేసులను సివిల్ కోర్టులకు మార్చుకోటానికి పిటీషను పెట్టారు. వీటన్నిటికి భయపడి అప్పుడే కొందరు ఈనామురైతులు ఈనాముదార్లకు తప్పిచ్చి రాజీపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈనాము రైతు సోదరులకు నా మనవి ఏమంటే - తొందరపడి ఈనాముదార్లకు తప్పిచ్చి రాజీలు చేసుకోనవసరములేదు. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘము ఇతర పెద్దలతో కలసి ఎస్టేటు లాండు ఆక్టును సవరించి, రైతులకు పూర్తిన్యాయము కలుగజేయటానికి మద్రాసు ప్రభుత్వమువద్దకు రాయబారం త్వరలో వెళ్ళనున్నది. ఈనామురైతులందరూ సభలు జరిపి, తీర్మానాలద్వారా పై ఆక్టులో సవరణ వెంటనే చేయవలసిందని కోరాలి. ప్రభుత్వముపై వత్తిడితెచ్చి విజయాన్ని పొందాలి. అంతేగాని తొందరపడి ఈనాముదార్లతో రాజీపడవద్దని కోరుచున్నాను.

గ్రామపారిశుధ్యానికి కొణిచర్ల యువకులుచూపే మార్గం

కృష్ణాజిల్లా నందిగామతాలూకాలో కొణిచర్ల అనే గ్రామముంది. సుమారు అయిదారు సంవత్సరాల క్రితం యీగ్రామంలో మితిలేని వర్షాలు కురిసి, 60 గజాల పొడవున - 4 గజాల వెడల్పున ఒక పెద్ద గొయ్యిపడింది. అప్పటినుంచి ప్రతిసంవత్సరం వర్షాల ప్రారంభం కాగానే [illegible] గొయ్యిఏర్పడింది. మోకాలిలోతు నీరు నిలిచేది. గొయ్యివున్న నీటిలోనుంచే నందలకొద్దీ మనుష్యులు, పశువులు వస్తూ పోతూ ఉండాలి. ఇలా ప్రతివిత్యమూ నడచుట [illegible]. దుర్వాసన బయలుదేరేది. ఈగలకు, దోమలకు, గొయ్యి ఆలవాలమయేది. వర్షాకాలం 4 మాసాలూ యిదే పరిస్థితి.

ఇట్టి మురుగువల్ల రోగాలు. అంటు వ్యాధులు ఏర్పడ్డేవి. గ్రామాన్ని ప్రమాద పరిస్థితుల్లో ముంచుతాయనే విషయం స్థానిక కమ్యూనిస్టులు, యువకసంఘ సభ్యులు గుర్తించారు. గ్రామపెద్దలను కలుసుకొని, మురుగును పూడ్చివేయడానికి అందరూ ముందుకు రావాలని ప్రోత్సహించారు. వారిందుకు అంగీకరించారు. 25-6-44 వ తేదీన యువకులు గ్రామంలో టముకు వేయించి, పలుగులు - పారలు తీసుకొని, కార్యస్థలంలో దూకారు. ఒక రైతు తన బండితో సహా వచ్చి, యువకులకు సాయపడ్డాడు. గంటసేపు గడిచిందో లేదో, 40 బండ్లు వచ్చి నిలబడ్డాయి. ఊర్లి వెలుపలనున్న కంకర కొలుకు రావడానికి కార్యక్రమం తయారైంది. వెంటనేబండ్లు బయల్దేరాయి. కంకరతో మురుగు నింపబడుతోంది. చిన్నా, పెద్దా విభేదాలు లేకుండా, గ్రామస్థు లందరూ పనికి పూనుకున్నారు. మొత్తం 130 బండ్ల కంకరతో పనిపూర్తిఅయింది. మురుగు ఉన్నస్థలంలో చక్కనిరోడ్డు తయారయింది.

ఈ ఉత్సాహం కాలసంఘసభ్యుల్ని కూడా కదల్చింది. తమసూల్కులుచుతూఉన్న గలీలను వ్యయంగాతీసివేసి, పరిశుభ్రం చేసుకున్నారు.

కొణిచర్ల గ్రామస్తులవలె ఇతరప్రాంతాల ప్రజలుకూడా స్వయంకృషివల్ల తమ ఆరోగ్యాన్ని కాపాడుకొని, గ్రామజీవనాన్ని అభివృద్ధిచేసుకోవాలని కోరుతున్నాము.

★

పుస్తక పరిచయం

ఉమ్మడి పొలం

రచయితలు: ఘువ్, క్షిమెంకో; కె. ఖోరిన్.
అనువాదం: విద్వాన్ విశ్వం: నవ్యసాహిత్యమాల అనంతపురం.
వెల: 4 అణాలు

జారుకాలంనాటి కరగండ్లుగ ఉక్కుపోత విధానంకింద రైతు విశాలవంతమైన సుజీవనాన్ని అనుభవిస్తూ; సమిష్టి వ్యవసాయ క్షేత్రాల్లో నూతన గాత్రియ పద్ధతుల ద్వారా అధికోత్పత్తిని కావసాగిస్తూ, విజ్ఞానం, సభ్యత, వ్యక్తిగౌరవాలను పెంపొందించు కొంటూవివిధజాతులమధ్య యెడతెగనిప్రేమ, సామరస్యాలతో తనజీవితాన్ని యెలా గడుపుతున్నదీ యీ చిన్నపుస్తకంలో వర్ణించబడ్డది. రైతులు సర్వతోముఖాభివృద్ధి పొందుటకు సమిష్టి క్షేత్రాలలో పాఠశాలలు; పుస్తక భాండాగారాలు, రేడియోలు, సినిమాలు, నాటకశాలలు, సంగీతసభలు, ఆటలు మొదలైన విజ్ఞాన-వినోద, క్రీడాసంస్థలు యేర్పాటు చేయబడ్డవి. జారుకాలంలో నిరక్షర కుక్షులైన రైతులు, నేడు ఉన్నత విద్యల నభ్యసించి, వివిధశాస్త్రాలలో ఉత్తీర్ణులై, వేర్వేరు పరిపాలనా శాఖలలో ఉన్నత పదవు లాక్రమించి, తమ బాధ్యతలనెల్లా నిర్వర్తిస్తున్నదీ క్లుప్తీకరించబడ్డది.

సామ్రాజ్యవాదంక్రింద కృంగి కృశించే ఆంధ్రరైతాంగానికి యీచిన్నపుస్తకం ఎంతైనా విజ్ఞానోదయం కలిగిస్తుంది. సామాన్యుల కర్థమయే సరళమైన భాషలో అనువాదం నడిచింది.

★

ప్రజాయుద్ధం

రచన: కాలినిన్
అనువాదం: వరుచూరి రామకోటయ్య
ప్రచురణ: సంస్కృతి గ్రంథమండలి, పెదంబూరు, మద్రాసు.
56 పేజీలు: వెల రు. 0-6-0.

హిట్లరు నియంతృత్వంకింద జర్మన్ ప్రజలెంత దౌర్భాగ్యస్థితికి తీసుకురాబడ్డారో, జర్మను ప్రజలకు తానిచ్చిన వాగ్దానాలను హిట్లరు యెలా భగ్నంచేశాడో, సోవియట్ రష్యాపై దొంగచాటుగా దురాక్రమణ చేయడంలో ఉద్దేశం యేమో, తెలియజేస్తూ కాలినిన్ (సోవియట్ ప్రభుత్వానికి అధ్యక్షుడు) రచించిన The Patriotic War అను పుస్తకానికి యిది తర్జుమా. మొదట నాజీలు కొంత సోవియట్ భూమిని ఆక్రమించుకొనగలుటకు కారణాలు, తరువాత క్రమంగా వెనుక్కుతరుమగొట్టబడుటకు కారణాలు వివరించబడ్డాయి.

అనువాదం మంచిదైన శైలిలో, సరళంగానే నడిచింది. కాని,మూలంలోవున్న కొన్ని వాక్యాలకు వేరుఅర్థంవచ్చింది. ఉదాహరణకు "Its (war) inner Political content is frought with incomparably greater dager for our People'' అని మూలంలోఉంది, ఆవాక్యాన్ని ఈక్రింది విధంగా తర్జుమాచేసి యుండవలసింది:

"పైకుజరిగే యుద్ధం వెనుక నిగూఢంగా దాగియున్న రాజకీయాలేవో జాగ్రత్తగా పరిశీలిస్తే, మొదటి ప్రపంచయుద్ధం కంటె ఈ యుద్ధం మనకనేకరెట్లు అపాయకరమైనదనే విషయం బోధపడగలదు." కాని, అనువాదకుడు

"అంతేగాక మన ప్రజలందరికీ ఈ యుద్ధ పర్యవసానంవలన మున్నెన్నడూలేని అతి ప్రమాదకరమైన రాజకీయభయాల భగ్నత కలగవచ్చు" (పేజీ 6) అనితర్జుమాచేశాడు. ఇలాగే 14 వ పేజీలో: "ఎర్రసైన్యానికి సైనవస్తువులు విరివిగా అందించబడుతున్నాయని మనమెవరం చెప్పలేము" [illegible] బదులు, "ఇట్టి వస్తువులను సరఫరా చేయడంలో ప్రభుత్వం ఇతరుల కంటె ఎర్రసైన్యానికే ఎక్కువ ప్రాధాన్యత నిస్తోంది. పొరులిందుకు నిందించరాదు" అని ఉండవలసింది.

బెంగాల్ కరువు నివారణకు వివిధరూపాల కృషి

బెంగాల్లో నేడు కరువు పరిస్థితులు లేవనీ, ఆహారపదార్థాలు విరివిగానే వస్తున్నాయనీ, సామ్రాజ్యవాదులు చేసే ప్రచారానికి జవాబుగా అన్నిప్రాంతాలలోను వివిధ ప్రజాసంస్థలు బెంగాల్ కరువును గురించి ప్రజల్లో ప్రచారంచేస్తున్నాయి.

24-6-44 వ తేదీని కృష్ణాజిల్లా చోడవరం గ్రామంలో "యువజన విజ్ఞానమండలి" వారు 'ప్రతిమ' అనేనాటకను ప్రదర్శించారు. ఇది బెంగాల్ కరువును కళ్ళకుకట్టినట్లు చూపే ఒకగాథ. జిల్లా యువజనసంఘ కార్యదర్శి తాతినేని సూర్యప్రకాశరావుగారు, బెంగాల్లో స్వయంగా పర్యటనంచేసివచ్చిన కలపాల దశరథరామయ్యగారు, బెంగాల్ కరువుకు కారకులు నిలవవ్యాపారస్తులేననీ, మనరాష్ట్రంలో కూడా నిలవవ్యాపారస్తుల ఆటకట్టుటకు ప్రజలంతాఏకంకావాలనీ, ఉద్బోధించారు.

డాక్టర్ల సహాయం

జగ్గయ్యపేటలో(కృష్ణా) డాక్టర్ వరదయ్యగారు "పీపుల్స్‌వార్" పత్రికలో బెంగాల్ కరువును గురించి ప్రచురించబడిన వ్యాసాలు చదివి, ఒక హుండీతీసుకొని ధనం వసూలు చేస్తున్నారు. తన డిస్పెన్సరీకి వచ్చినవారిచేత హుండీలో వారివారి శక్తిసామర్థ్యాలనుబట్టి విరాళాలు యిచ్చునట్లు ప్రబోధం చేస్తున్నారు. ఇంతవరకు (27-6-44) సుమారు రు. 18 వసూలైంది. ఇలా వసూలైన ధనాన్ని పీపుల్స్ రిలీఫ్ కమిటీ (కలకత్తా)కి [illegible]తున్నారు.

బెంగాల్ నిధికి బాలసంఘ వసూళ్లు

కొండపల్లి బాలసంఘం పేదగారు (చిత్తనాటకు) సభ్యులద్వారా రు. [illegible] ప్రోగుచేసి బెంగాల్ నిధికి ఇచ్చారు.

కొత్తపల్లి (తూర్పుగోదావరిజిల్లా) సంఘంలో 18 సభ్యులున్నారు. కొందరు బెంగాల్ బుర్రకథ, [illegible]కథ చెపుతూఇంటింటికి తిరిగి రు. [illegible] పోగుచేశారు. [illegible] చొక్కాలు బెంగాల్ నిధికి వసూలుచేశారు.

మాతక్కి గ్రామ బాలసంఘం, బెంగాల్ నిధికి రు. 1-4-0 వసూలుచేసి పంపింది.

బెజవాడ కొత్తపేట బాలసంఘం, మహిళాసంఘ సభ్యులుకలిసి రు. [illegible] 18 సేర్లబియ్యం, 4 బట్టలు వసూలుచేసి బెంగాల్‌నిధికి పంపింది.

●

మరణశయ్యపైనుండి బెంగాల్‌కు విరాళం

కర్నూలుజిల్లా కంభంపాడు తాలూకా రాజాపాలెం అనే గ్రామం ఉంది. అక్కడ సిద్దారెడ్డి రంగారెడ్డి అనే 21 సంవత్సరాల యువకుడు, 22-6-44 వ తేదీన చనిపోయాడు. బెంగాల్ కరువునివారణకు తనవద్దనున్న రు. 5-0-0 విరాళంగా యిచ్చాడు. బెంగాల్ ప్రజలు మృత్యుదేవతకు ఆహుతికాకుండా కాపాడమని సందేశమిచ్చి, ప్రాణాలు విడిచాడు. కామ్రేడ్ రంగారెడ్డికి మా జోహారులు.

విప్లవ జోహారులు

కామ్రేడ్ వసంతం గోపాలరావు వచ్చంబాడిపర్రులో (గుంటూరుజిల్లా) యువక కమ్యూనిస్టు. వయస్సు 16 సంవత్సరాలు. పొన్నూరు హైస్కూలులో 6 వ ఫారం ప్యాసయాడు. సుమారు 1 సంవత్సరంక్రిందట యువకకమ్యూనిస్టుగా పార్టీలోచేరి, తాను చదువుతూన్న హైస్కూలులో విద్యార్థిఉద్యమ నిర్మాణానికి పాటుపడి పనిచేశాడు. ఇతడు గతమాసం 12 వ తేదీని టైఫాయిడ్‌జ్వరం వల్ల చనిపోయాడు.

●

కామ్రేడ్ పసుపులేటి వెంకటేశ్వర్లు జాగర్లమూడి (గుంటూరుజిల్లా)లో 1 సంవత్సరం నుండి పార్టీసభ్యుడు. ఆకుతోట కూలీలలో పనిచేస్తున్నాడు. వయస్సు 20 సంవత్సరాలు. ఇతనికి మ్యూతపిండంలో కురుపులేచి, వారం రోజులు బాధపడి, 17-6-44 వ తేదీని చనిపోయాడు.

కామ్రేడ్స్, మీకు మా విప్లవ జోహారులు. వారి కుటుంబాలకు మా సానుభూతిని తెలియజేస్తున్నాం.

లేడీహోప్ కళాశాల ప్రారంభం

గుంటూరు మ్యునిసిపల్ కౌన్సిల్ జూన్ 20 వ తేదీన సమావేశమై లేడీహోప్ (స్త్రీల) కళాశాలను వాయిదా వేయరాదని తీర్మానించింది. జులై 15 వ తేదీన కళాశాల ప్రారంభమవుతుంది. అధ్యాపకులు కూడా నిర్ణయించబడ్డారు. కళాశాలను వాయిదా వేయకుండా ఈ నిర్ణయానికి వచ్చినందుకు గుంటూరు మ్యునిసిపాలిటీని అభినందించారు.

★

గుంటూరు జిల్లా మహిళాసంఘం తరఫున మోటూరి ఉదయం, లక్ష్మీకాంతం, హనుమాయమ్మగార్లు జూన్ రెండవవారంలో ఒంగోలు తాలూకాలో పర్యటనం చేశారు. మహిళా సంఘాల అవశ్యకతను గురించి, ఆరోగ్యవిధులనుగూర్చి, స్త్రీల హక్కులను గూర్చి ప్రచారం చేశారు. మైనంపాడు గ్రామంలో బుర్రకథ చెప్పారు. కొత్తపట్నం ఏరియాలో మలేరియా విపరీతంగా ఉంది. అందుచే యీ గ్రామాలలో ప్రచారంచేసి, రైతుసంఘంచే నెలకొల్పబడిన వైద్యశాలలో (కొత్తపట్నం) చికిత్సపొందవలెనని ప్రోత్సహించారు. సత్యంచేయాలని [illegible] [illegible] వారుకూడా. [illegible] తీసుకొంటున్నారు. కొత్తపట్నంలో 38 మంది మహిళాసంఘంలో సభ్యులుగా చేరారు.

నైజాం రాష్ట్రంలో ధాన్య సేకరణ సమస్య

ఆహారసమస్య నెదుర్కొనడానికి నైజాం ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకొంది. అవసరమున్న ప్రదేశాలకు పంపడంకోసం నిలవ చేయాలనే ఉద్దేశంతో ధాన్యసేకరణశాసనం అమలుజరిపింది. కాని దీని విషయంలో కొన్ని లోటుపాట్లు బయటపడుతున్నాయి. ముఖ్యమయిన లోపం ఏమంటే - ప్రజల సహకారంతో కాకుండా, పిరంకుశ, లంచగొండిఅధికారవర్గంద్వారాఈస్కీమును అమలుజరిపిద్దామనుకొంటూంది నైజాం ప్రభుత్వం. ధాన్యసేకరణ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన మినహాయింపులనయినా ఈ అధికారులు పాటించడంలేదు. లంచాలిచ్చేవారికే పకాలంలో, సక్రమంగా కాటావేయించడం వగైరా సౌకర్యాలు కలిగిస్తున్నారు. తరుగులపేరిట అదనంగా వసూల్లుచేస్తున్నారు.

పరిస్థితులిలా ఉండగా, ధాన్యపు వసూళ్లరేట్లను యిటీవల పెంచింది ప్రభుత్వం. వీటన్నిటి ఫలితంగా రైతుల్లో అసంతృప్తి. ఆందోళన కలుగుతున్నాయి.

ఆంధ్రమహాసభ కృషి

ఖమ్మం తాలూకా రామన్నపేటలో ఆపేరుపెట్టి, ఈసంకచెప్పి, ఎక్కువ ధాన్యం వసూలుచేశారు. రైతులు ఆందోళనచేయగా, మిగులుకే వారివారి భాగాల ప్రకారం తిరిగి ఇచ్చేస్తామన్నారు. రెండు నెలలు గడచినా, ఏమీ తిరిగిరాలేదు. దానిమీద రైతులు తాలూకా ఆంధ్రమహాసభ ద్వారా తహసీల్దారుతో చెప్పుకున్నారు. ఆయన పట్వారీని పిలిపించి, విచారణజరిపి, ఎవరికి ముట్టవలసింది వారికిప్పించమని చెప్పారు. ఈ ఉత్తరువు అమలుజరిగింది.

ఖమ్మం తాలూకాలోనే కాచిరాజుగూడెంలో ఇదివరకే మూడుసార్లు ధాన్యం సేకరించారు. అది జరిగిన తరువాత గ్రామ అవసరాలకు చాలినంత ధాన్యం లేకపోయింది. ఆలాంటి పరిస్థితుల్లో రెవిన్యూ ఇన్స్పెక్టరు మళ్ళీవచ్చి "మీదగ్గరున్న ధాన్యంలో సగం వసూలుచేయాలని ఉత్తరువువచ్చింద"న్నాడు. ఈ అన్యాయం జరక్కుండా చేయడానికి స్థానిక ఆంధ్రమహాసభ కార్యదర్శి నాయకత్వాన రైతులు అవ్వల్ తాలూకాదారు (జిల్లాకలెక్టరు) వద్దకు డెప్యుటేషన్ వెళ్ళారు. పరిస్థితులన్నీ విన్నమీదట, ఆయన తహసీల్దారుని విచారణకు పంపారు. తహసీల్దారు వచ్చి విచారణచేసి, "మీకుటుంబ వ్యవసాయఅవసరాలకుపోగా మిగిలితేనే వసూలుచేస్తాము" అని హామీ ఇచ్చారు. గ్రామానికి కావలసిన కిరోసిన్, పంచదార కూడా సప్లయి చేయడానికి ఒక రైతును నియమించారు.

భువనగిరి తాలూకాలో కూడా ప్రభుత్వ ఏజంట్లు కంట్రోలు రేట్లకు విరుద్ధంగా తమ ఇష్టంవచ్చినట్లు తక్కువ ధరలకు ధాన్యం వసూలుచేస్తున్నారని; గోదాములవద్ద అదనపు వసూళ్ళు, తప్పుడు తూనికలు సాగుతున్నాయని వార్తలు వచ్చాయి.

సూచనలు

పైన వుదహరించిన లోపాలు సరిచేయకపోతే ఆహారసమస్య పరిష్కారం కావడానికి బదులు మరింత ఎక్కువౌతుంది. ఈవిషయాన్నిగుర్తించి వరంగల్లు జిల్లాఆంధ్రమహాసభకమిటీవారు గతమాసం 20 వ తేదీన జరిగిన సమావేశంలో కొన్ని సూచనలు యిచ్చారు. రైతు కుటుంబ,వ్యవసాయ అవసరాలకు పోను, మిగిలినధాన్యమందే ప్రభుత్వం తీసుకోవాలన్నారు. పంటను కోయకముందే అంచనా వేయాలనీ, అంచనాను నిర్ణయించడంలో తగు శ్రద్ధతీసుకోవాలనీ సూచించారు. లంచగొండితనాన్ని రూపుమాపాలన్నారు. తూకముల విషయంలో అన్యాయం జరక్కుండా చూచేఅధికారం ప్రజాప్రతినిధుల కివ్వాలన్నారు. మొత్తంమీద ఈ స్కీమును అమలుజరుపుటలో ప్రజాసహకారాన్ని పూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వకమిటీల్లోకి ప్రజాప్రతినిధులను తీసుకోవాలని కోరారు.

పంటలు చెడిపోయిన పరిస్థితులలో లేవీరేట్లను ఈ క్రింది విధంగా మార్చాలని తీర్మానించారు.

1 యకరం వరకు పూర్తిమినహాయింపు

1 యకరం నుంచి 3 యకరాల వరకు యకరం 1 కి 1 మణుగు

3 యకరముల నుంచి 5 యకరాల వరకు యకరం 1 కి 2 మణుగులు

5 యకరముల నుంచి 10 యకరాలవరకు య 1 కి 3 మణుగులు

10యకరాలపైన యకరానికి 4మణుగులు తీసుకోవాలన్నారు. 6 అణాల పంటకు పూర్తిగాను, 12అణాలపంటకు సగంమినహాయింపు ఇవ్వాలన్నారు. ఈమార్పులనంగీకరించి, ప్రజాసహకారంతోపనిచేస్తే ధాన్యసేకరణ స్కీము జయప్రదంకాగలదని హెచ్చరించారు.

ప్రతితాలూకాలోని ముఖ్యగ్రామాల్లో చౌకడిపోలు పెట్టించి, జీవితావసర వస్తువులన్నిటిని కంట్రోలుధరలకు ప్రజలకందివ్వాలని కోరారు. ఈవిధంగా దొంగవ్యాపారుల ఆటలను అరికట్టాలని వరంగల్ సమావేశం తీర్మానించింది.

నిడదవోలులో ఐక్య ఆహారసమస్య

దురాగావతులగు [illegible] అగలా నిడదవోలులో విలిథపక్షం, విభిద [illegible] శ్రేయులుల్ని కదల్చాయి. వీరి [illegible] కల్గి, ఆహారసమస్యా పరిష్కారానికి కృ[illegible] చేయుడానికి ఈ ప్రముఖులు గతమాసం 20 వ తేదీన ఐక్య ఆహారకమిటీగా ఏర్పడ్డా[illegible] దీనికి అధ్యక్షులు [illegible] కాంగ్రెసువా[illegible] తల్లాప్రగడ ప్రకాశరాయుడుగారు; కార్య[illegible] కామ్రేడ్ సామన ప్రహ్లాద, కాశీపట్నం కొండయ్యగారివంటి విజ్ఞానవేత్తలు, ముస్లింలయిన అబ్దుల్ గఫర్‌సాహెబ్, అహ్మ[illegible] దుల్లా గార్లు, కార్మిక నాయకులు, ఇంకా పలువురు ప్రముఖులు సభ్యులుగాచేరారు.

(1 వ పేజీ తరువాయి) గ్రామం మొత్తంమీద 1500 బస్తాల ధాన్యం మాత్రమే ఉంది. అదయినా కొద్దిమంది రైతులవద్ద గుప్తంగా ఉంది. వీరుమినహా మిగతావారంతా ఇతర ప్రాంతాలనుండి వచ్చే ధాన్యంపై ఆధారపడవలసినవారే. వీరికి పునాసపంట వచ్చేంతవరకు కనీసం నెలకు 600 బస్తాల బియ్యం కావాలి. కాని తాలూకా తహసీల్దారు గతమాసం కోఆపరేటివ్ స్టోర్సుకు 46 బస్తాల బియ్యం మాత్రమే ఇప్పించాడు. మరో చిల్లర వర్తకునికి 12 బస్తాలిప్పించాడు. ఇవి ఏమూలకు వరిపోతాయి? ఈ పరిస్థితులను అవకాశంగా తీసుకొని కొందరు చిల్లర వ్యాపారస్తులు దొంగవ్యాపారం ప్రారంభించారు. స్టోర్సులో బియ్యం అయిపోగానే వీరు రూపాయికి 2¼, 3¼ శేర్లు అమ్ముతున్నారు. ఈనెల మొదటి తేదీని ఒక వర్తకుడు ఎక్కువరేటుకి 4 బస్తాల బియ్యాన్ని పాటిబండ గ్రామానికి అమ్మాడు. ఆహారకమిటీవారు ఇది కనిపెట్టి ఆ నాలుగు బస్తాలను రూపాయికి 3¼ శేర్లు చొప్పున 150 మందికి అమ్మించారు. అధికారులకిదొక గుణపాఠం. దొంగవర్తకులకు తగినశాస్తిచేసి, ప్రజాసంస్థల సహకారంతో కృషిచేస్తే ప్రజలందరి అవసరాలను తీర్పగలరు.

నెల్లూరు జిల్లాలో

పుటుకూరు (నెల్లూరిజిల్లా, కోవూరు తాలూకా)లో రైతులవద్ద మంచి ధాన్యం కావాలంటే, న్యాయంగా శేరు 1కి రు 0-1-9 ఇచ్చితీరికోవాలి. కానివర్తకులు శేరు1కి0-1-0, 0-1-3 ఇచ్చికొనేవారు. ఇదిఅన్యాయం, ఇకమీదట 0-1-9కే కొనాలని రైతుసంఘం వారు వర్తకులకు ఎంతోచెప్పారు. కాని వర్తకులు వినలేదు. అంతేకాకుండా ప్రజలకు కావలసిన అగ్గిపెట్టెలు మొదలయిన వాటిని హెచ్చుధరలకు అమ్ముచుండేవారు. ఏలూరు వెంకటసుబ్బారెడ్డి, కొప్పోలు మహాలక్ష్మమ్మ అను వర్తకులు "మేము కంట్రోలురేటుకు అమ్మము" అని ఖచ్చితంగా చెప్పేశారు. ప్రజలసలహాపైని రైతుసంఘంవారు ఈవర్తకుల విషయాన్ని అధికారులకు తెలియజేశారు. అసిస్టెంటు కమ్మర్షియల్‌ఆఫీసరు వచ్చి విచారణచేశాడు. వర్తకుల అంగళ్లను సోదాచేసి, అగ్గిపెట్టెలు, పలుపు అల్లుకొనునూలు మొదలైనవాటి నిలవలను బయటికిలాగాడు. ఇకమీదట ఇలాంటి అక్రమాలు చేయగూడదు - సరకులను సక్రమధరలకు అమ్మాలనీ; వడ్లు శేరు రు 0-1-9 .కే కొనాలనీ వర్తకులను ఆజ్ఞాపించాడు. వర్తకులు అందుకు ఒప్పుకోక తప్పిందిగాదు. రైతు వర్కర్లు అంతటితో తృప్తిపడలేదు. ప్రతి వస్తువుమీద రూపాయికి 0—1—6 కన్న ఎక్కువలాభం తీయకూడదు; కంట్రోలు వస్తువులు, బట్టల నీలింగుధరలు బోర్డుపైరాసి అంగడిఎదుట పెట్టాలి; ముద్రలుగల కొలతపాత్రలు, తూనికరాళ్లనే ఉపయోగించాలి అని తీర్మానాలురాసి - వాటిని అమలుజరపకపోతే తగుచర్య తీసుకోవచ్చునని అంగడివాళ్లచేత సంతకాలు పెట్టించారు.

నాయుడుపేటలో మిల్లుబట్టల వర్తకులు కొందరు ఇలాగే కంట్రోలు ధరలకు మించి అమ్ముతున్నారు. దీనిని బట్టబయలుచేస్తూ, రైతుసంఘంవారు గోడలమీద కంట్రోలు ధరలు రాసి - ఆధరలకు ఏవర్తకుడైనా ఇవ్వకపోతే రైతుసంఘంతో వచ్చి చెప్పాలని ప్రచారంచేశారు. ఇక దానితో రైతుసంఘం వారు వెంటఉంటే కంట్రోలుధరకు అమ్మటం, లేకపోతే తమ ఆటలు సాగించడం - ఈపరిస్థితి ఏర్పడింది. ఇది పరిష్కారమార్గంకాదు. ప్రభుత్వం జోక్యం కలిగించుకొని వర్తకుల కంట్రోలుధర కమ్మేలా చేయాలి. కోఆపరేటివ్ స్టోర్సును స్థాపించుకొని, దానిద్వారా తమకు కావలసిన సరకులన్నిటిని పొందుటకు ప్రజలు కృషిచేయాలి.

విశాఖజిల్లాలో

విశాఖజిల్లాలో పార్వతీపురం డివిజను అంతటా ఆహారసమస్య ఆందోళనకరంగా ఉంది. పార్వతీపురంలో బియ్యం రూపాయికి ఒకశేరు, రాగులు 5 శేర్లు అమ్ముతున్నారు వర్తకులు. బ్రతుకే దుర్భరంగా ఉంది — సరిపడేంత సరుకు సప్లయి చేయవలసిందని ప్రజలు సబ్‌కలెక్టరువద్దకురాయబారంవెళ్లారు, బియ్యం సప్లయి గ్యారంటీ చేయలేను. రాగి మొదలయిన మెట్టధాన్యాలు కొంతవరకు సప్లయి చేస్తామని ఆ అధికారి చెప్పారు. దొంగవ్యాపారాన్నరికట్టి, ప్రజలకు సరిపడేంత సరుకు సప్లయి చేయకపోతే ఏర్పడగల ఘోరపరిస్థితులను ఈ అధికారి గుర్తించాలి. విశాఖజిల్లాలోనే ఇలాంటి పరిస్థితులకు ఉదాహరణ ఉంది. ఉత్తరవిశాఖలో కొన్ని గ్రామాల్లో బియ్యము, రాగులు దొరక్క ప్రజలు ఫలవలు తింటున్నారని తెలుస్తూంది. అక్కడక్కడ ప్రభుత్వం బియ్యపుడిపోల్లు పెట్టినా, సప్లయిలు కావలసినంత, సరిగా జరక్కపోవడంవల్లనే అక్కడి ప్రజల కీగతి పట్టిందని స్పష్టమవుతూంది. పరిస్థితు లింకా విషమించకముందే అధికారులు మేల్కోవాలి. ప్రజాసంస్థల సహకారంతో కరవు పరిస్థితుల నెదుర్కోవాలి.

ప్రజాశక్తి ప్రచురణలు కొనువారికి హెచ్చరిక

ప్రజాశక్తి కార్యాలయంవారు ప్రచురించిన పాటలపుస్తకాలను చిలకలూరిలోని యక్కలకోటయ్య అను షాహుకారు గుంటూరులోను, బెజవాడలోను, కొనుక్కొనివచ్చారు. అపుస్తకాలన్నిటిని, వాటిమీదవున్న ధరలకంటె ఎక్కువధరలకు అమ్ముతున్నారు. ప్రజా పాటలు 0-3-0కి (అసలుధర 0-2-0). హిట్లర్ పరాభవం 0-6-0 కి (అసలుధర 0-4-0). టాన్యాచరిత్ర 0-3-0 కి (అసలు ధర 0-2-0), అమ్ముతున్నాడు. ప్రజాశక్తి ప్రచురణలన్నీవాటిమీద ఉన్న ధరలకంటె ఎక్కువకు అమ్మకూడదు. కాబట్టి ప్రజలెవ్వరు వాటిమీదవున్న ధరలకంటె ఎక్కువకు కొనవద్దు.

*

కొత్తగా వెలువడ్డాయి

1	సోవియట్ స్త్రీలు	0	10	0
2.	మబ్బుతెర (నాటిక)	0	6	0
3	మలబారు రైతుఉద్యమ చరిత్ర	0	10	0
4.	వీరమాత (సోవియట్ కథలు)	0	8	0
5.	సోవియట్ విదేశాంగనీతి: భారతదేశం	0	10	0

ప్రజాశక్తి కార్యాలయం, బెజవాడ.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE